జనరాజకీయం కోసం ...

₹ 10

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 4 సంచిక - 12 పక్షపత్రిక జూలై 1-15, 2013



## మా పల్లెసిత్రాలు

## సురాజ్యం

## ఫొటో ఎగ్జిబిషన్



మొదటి బహుమతి ఫొటో

- వేత శ్రీనివాస్, విజయనగరం



రెండవ బహుమతి ఫొటో

- జి.ఎ.నాయుడు, కడప



మూడవ బహుమతి ఫొటో

- బి.సింహాచలం, శ్రీకాకుళం



స్పెషల్ జ్యూరీ అవార్డు పొందిన చిత్రం-1
కొండా శ్రీనివాస్‌గౌడ్

నల్గొండ జిల్లాలో చెలిమలో దాహం తీర్చుకుంటున్న ఒక మహిళ
సంస్థాన్‌నారాయణపూర్ - రాచకొండగుట్ట



స్పెషల్ జ్యూరీ అవార్డు పొందిన చిత్రం -2
బి. భోగారావు

శ్రీకాకుళం జిల్లాలో ఉపాధి హామీ పనుల్లో వికలాంగులు



కన్సొలేషన్ బహుమతి పొందిన చిత్రం-1
సంపత్‌కుమార్

ఖమ్మం జిల్లాలో గృహపరిశ్రమగా సారా
గుండాల మండలం కొనవారిగూడెం



కన్సొలేషన్ బహుమతి పొందిన చిత్రం-2
మయూరి రామకృష్ణారెడ్డి

నల్లగొండ జిల్లాలో పుడమితల్లి ఒడిలో పుత్తడిబొమ్మ
కోదాడ మండలం భూక్యాతండా



కన్సొలేషన్ బహుమతి పొందిన చిత్రం-3
దుర్గాప్రసాద్

తూర్పుగోదావరి జిల్లాలో నీటిముదుగులో పాఠశాల
తాడేశ్వరం



సురాజ్య ఉద్యమం మా పల్లెచిత్రాలు
ఫొటో ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న జేపీ



కన్సొలేషన్ బహుమతి పొందిన చిత్రం-4
ఏ. శ్రీనివాస్

ఖమ్మంజిల్లా గోదావరి లోయ నుండి వెదురు బొమ్మలు
అమ్మకానికి తెస్తున్న మహిళలు

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక జూలై 1-15, 2013

సంపుటి - 4 సంచిక - 12

## లోపలి పేజీల్లో...

సురాజ్యం.. మాపల్లెసిత్రాల ఫొటో ప్రదర్శన...... 5

మనలో హేతుబద్ధ బహిరంగ చర్చ లోపిస్తోంది: జేపీ...... 6

పిల్లల జీవితాలతో చెలగాటం..................... 8

సర్కారీబడులిలాగే ఉంటాయ్ ..................... 11

ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించకుండా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల మూసివేత తగదు.. 12

రాజకీయ పార్టీలను సమాచర పరిధి నుంచి తప్పించే కుట్రపై పోరాడతాం : లోక్‌సత్తా........ 13

తాగునీరు ఎంత దూరం............................. 14

ప్రభుత్వమే మద్యం దుకాణాల్ని నిర్వహించాలి.... 15

బెల్టుషాపులను ప్రోత్సహించేదిగా ప్రభుత్వ మద్యం విధానం.......................... 17

జేపీసమక్షంలో లోక్‌సత్తాలో చేరిన కాంతికన్నన్.... 19

పదునుపట్టాం పనిచేయండి......................... 20

జిల్లాలలో కార్యక్రమాలు............................ 21

పంచాయతీ ఎన్నికలు క్ష అభ్యర్థుల అర్హతలు, అనర్హతలు......... 26

# మద్యం చుట్టూ రాష్ట్ర రాజకీయం

## సంపాదకీయం

మన రాష్ట్రంలో రాజకీయం మద్యం వలయంలో చిక్కుకున్నది. ప్రభుత్వాలు మారుతున్నాయి. వాగ్దానాలు మిగులుతున్నాయి. గ్రామీణ పేదల జీవితాలు మాత్రం బండలవుతున్నాయి.

1998లో మద్యనిషేధం తొలగించినప్పుడు చంద్రబాబు కఠిన మద్యనియంత్రణ అమలు చేస్తామని, పాక్షికంగానే మద్యనిషేధం తొలగిస్తున్నట్లు ప్రకటించారు. మద్యనిషేధం సాధ్యం కాదు కనుక మద్యం మాఫియాలు విస్తరిస్తున్నందున నిషేదాన్ని సవరిస్తున్నట్లు ప్రకటించారు. మద్యాన్ని ప్రభుత్వ ఆదాయ వనరుగా గుర్తించారు. ఈ ఆదాయంతో జనాకర్షణ పథకాలతో పేదల ఓటు బ్యాంకుల కోసం పూనుకున్నాయి. ఈ మద్యం వ్యాపారంలో రాజకీయ పార్టీల నేతలు వాటాదారులయ్యారు. సిండికేట్ల అవతారం ఎత్తారు. ప్రభుత్వాలకి ఆదాయం, నేతలకి ఆదాయం, ఎన్నికల్లో ఖర్చు చెయ్యడానికి కోట్లు, ప్రలోభానికి మద్యం పంపిణీ, మరోపక్క పేదల సంక్షేమానికి కృషి చేసే పోజు ఇవన్నీ మద్యం చుట్టూ కలగలిసిన రాజకీయం అయింది.

ఆనాటి ఈ మొక్క ఇప్పుడు పెద్ద వృక్షం అయింది. రెండుమూడు వేలకోట్ల ఆదాయంతో, బెల్టుషాపులతో ప్రారంభమైన మద్యం వ్యాపారం ఇప్పుడు 20 వేల కోట్లకు పై బడిన ఆదాయంగా వీధి వీధిలో వెలసిన బెల్టు షాపులతో విస్తరించింది.

మద్యనియంత్రణ మర్చిపోయి మద్యం విక్రయాలే ప్రభుత్వ పాలన అయింది. గ్రామాలు మద్యంలో తేలియాడుతున్నాయి. పేదల కుటుంబాలు చితికిపోతున్నాయి. సంసారాలలో చిచ్చులు పెరిగాయి. చిన్న వయసులోనే మరణాలు, వితంతువులు, బాలకార్మికులు అంతా ఈ వ్యవస్థ నుండి పుట్టుకొస్తున్నారు.

ప్రభుత్వం కొత్త ఎక్సైజ్ పాలన పేరుతో గత సంవత్సరం వేలంపాటలను రద్దు చేసి లాటరీ పద్ధతి ప్రవేశపెట్టింది. దీనివల్ల వేలంపాటల వెర్రి తగ్గుతుందని, బెల్టుషాపులకు అనుమతి ఉండదని ప్రకటించింది.

కాని ఫలితాలు విరుద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వమే 'వేలం' పాటల ధరను నిర్ణయించింది. కొన్ని షాపులు తీసుకునే వారే లేని స్థితిని సృష్టించింది. ఈ లాటరీలో షాపు దక్కినా, బెల్టుషాపులు ఉండక తప్పని స్థితి కల్పించింది. అయినా ప్రభుత్వం తీరుమారలేదు. ఇప్పుడు కొత్తగా సిట్టింగ్‌రూమ్‌ల పేరుతో మినీ బార్లు తెరిచింది. పెరిగిన జనాభాకు తగ్గట్టుగా షాపు ధర నిర్ణయించింది. అమ్మకాలకు టార్గెట్లు కొనసాగుతున్నాయి.

ఈ పాలన మద్యాన్ని పెంచేది. బెల్టు షాపుల్ని పెంచేది. పేదల బతుకుల్ని ఛిద్రం చేసేది. ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో మద్యం వ్యాపారం ఉన్నంతకాలం జరిగేది ఇంతే. ప్రభుత్వమే పరిమితంగా, పరిమిత వేళల్లో షాపులు నిర్వహించడం తప్ప మార్గం లేదు. కాని ప్రభుత్వానికి ఆ చిత్త శుద్ధి లేదు. ◆

## సంపాదకవర్గం

డా॥ జయప్రకాష్ నారాయణ్
ప్రధాన సంపాదకులు

డి.వి.వి.యస్. వర్మ
సంపాదకులు

సంపాదక వర్గం
జి. రాజారెడ్డి
బండారు రామ్మోహన్‌రావు
కొంగర గంగాధరరావు
కె.వి. కుటుంబరావు
సి.హెచ్.ఎస్. మాధవరావు

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి
ఫొటోలు : ఎన్. సంజీవ్ కుమార్




# కార్టూన్ కార్నర్

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**

*8-2-674బి/2/9, ప్లాట్ నం : 93*
*హ్యాపీ వ్యాలి, రోడ్ నం. 13ఎ,*
*బంజారాహిల్స్, హైదరాబాద్ - 500 034*
***ఫోన్ నంబర్లు :***
***040- 23311817, 23311819,***
***23311820, 23312829***
***ఫ్యాక్స్ : 040-23310612***
accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311817**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836 ఎస్.బి.హెచ్., పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజి | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

- ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

# సురాజ్యం... పల్లెసిత్రాల ఫొటో ప్రదర్శన

గ్రామీణ భారతదేశంలోని జీవనస్థితిగతులపై జూన్ 24న హైదరాబాద్ రవీంద్రభారతిలో సురాజ్య ఉద్యమం ఫోటో ప్రదర్శనను నిర్వహిస్తోంది.

గ్రామ ప్రాంతాలలోని జీవితంపై వేసవి సెలవలలో (ఏప్రిల్–మే, 2013) 'మా పల్లెసిత్రాలు' పేరుతో సురాజ్య ఉద్యమం ఫోటో పోటీని నిర్వహించింది. గ్రామాలలో అభివృద్ధికి తోడ్పడుతున్న అంశాలపై, ఆటంకంగా ఉన్న కారణాలపై యువతలో అవగాహనను పెంచేందుకు ఈ చిత్రీకరణ పోటీని ఏర్పాటుచేశారు.

విద్య, ఉపాధి, ఆరోగ్యం మరియు వైద్య సేవలు, పారిశుధ్యం మరియు ఆరోగ్యం, గ్రామీణ యువత, గ్రామీణ మహిళలు, ప్రభుత్వ సేవలు – విధానాలు, కార్యక్రమాలు, గ్రామీణ మౌలిక వసతులు, సామాజిక చైతన్యం అంశాలు ఈ పోటీకి ఇతివృత్తాలుగా ఉన్నాయి.



సుపరిపాలన, నైతిక రాజకీయాల ద్వారా అవినీతిని అంతం చేసి, అందరికీ ఎదిగే అవకాశాలనిచ్చే సురాజ్యాన్ని సాధించేందుకు యువత ముందుకు రావాలనే ప్రధాన నినాదంతో ప్రజాస్వామ్య సంస్కరణల పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా ఆగస్టు, 2012లో పార్టీ రాజకీయాలకతీతంగా సురాజ్య ఉద్యమాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. డా॥ జయప్రకాష్ నారాయణ్ సురాజ్య ఉద్యమానికి కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు.

"అవినీతి కట్టడికి బలమైన లోకాయుక్తతోపాటు ప్రభుత్వ సేవల్ని హక్కుగా అందించే పౌరసేవల గ్యారంటీ చట్టం ఏర్పాటు, జనం చేతికి అధికారాన్నిచ్చేలా రాష్ట్రబడ్జెట్‌లో 10శాతం స్థానిక ప్రభుత్వాలకు ప్రత్యక్షంగా కేటాయింపు, ప్రతి ఒక్కరికీ ఎదిగే అవకాశాల కోసం అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించటం" తదితర అంశాలు సురాజ్య ఉద్యమ ప్రాథమిక లక్ష్యాలుగా ఉన్నాయి.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణాభివృద్ధి సంస్థ మాజీ కమిషనర్ చంద్రమౌళి, సినీ దర్శకుడు శేఖర్ కమ్ముల, ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్షుడు కె. శ్రీనివాసరెడ్డితో కూడిన జ్యూరీ సురాజ్య ఫోటో పోటీ విజేతలను ఎంపిక చేసింది.

24వ తేదీ ఉదయం 11–30గంటలకు రవీంద్ర భారతి సమావేశమందిరంలో మొదలయ్యే కార్యక్రమంలో సురాజ్య ఉద్యమ స్టీరింగ్ కమిటీ కన్వీనర్ డా॥ జయప్రకాష్ నారాయణ్, సభ్యులతో కలిసి ఫోటో పోటీ విజేతలకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాదరావు నగదు బహుమతుల్ని ప్రదానం చేస్తారు. అనంతరం అదే ప్రాంగణంలోని ఐ.సి.సి.ఆర్ ఆర్ట్ గ్యాలరీలో సురాజ్య ఫోటో ఎగ్జిబిషన్‌ని మంత్రి పారంభిస్తారు.

ఫోటో ప్రదర్శనను మధ్యాహ్నం గం॥ 1–30 నుంచి రాత్రి 7గంటల వరకూ ప్రజలు కూడా సందర్శించవచ్చని కమిటీ వర్గాలు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపాయి. ■



# మనలో హేతుబద్ధ బహిరంగ చర్చ లోపిస్తోంది: జేపీ

**సుపరిపాలనపై ఇంటర్నేషనల్ సెంటర్ గోవాలో ప్రసంగించేందుకు ఇటీవల గోవా వెళ్లినప్పుడు అక్కడి 'హెరాల్డ్' ఆంగ్లపత్రిక ప్రతినిధి నిషితా నాయర్ శ్రీవాస్తవకు లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ ఇచ్చిన ఇంటర్వ్యూ 'లోక్‌సత్తా టైమ్స్' పాఠకుల కోసం స్థూలంగా...**

**హెరాల్డ్:** 'రాజకీయనేతలు – విలన్లా, బాధితులా?' అనే అంశంపై ఇక్కడ మీరు ప్రసంగిస్తూ, కిందిస్థాయిలో ఉండే మునిసిపాలిటీలు, పంచాయతీలలో మితిమీరిన నిర్మాణం, అరకొర అధికారాలతో ఉండటం వల్ల ఉత్సవ విగ్రహాలులాంటి ప్రభుత్వాలుగా తయారయ్యాయి' అన్నారు. వాటికి మరిన్ని అధికారాల్ని ఇవ్వాలని మీరు కోరుతున్నారా? దానివల్ల ఇప్పటికే ఉన్న అవినీతి ఇంకా పెరగదా? స్థానిక ప్రభుత్వాలలో అవినీతిని తగ్గించి, ప్రజలకు నిజమైన ప్రాతినిధ్యం వహించేలా వాటిని తీర్చిదిద్దటం ఎలా?

**జేపీ:** స్థానిక ప్రభుత్వాలకు గణనీయంగా అధికారాలు, వనరులలో నేరుగా వాటా ఉండాల్సిందేనని చాలా ఖచ్చితంగా చెప్పగలను. కానీ ఈ ఏర్పాటుతోపాటే, అధికార దుర్వినియోగం లేకుండా జవాబుదారీతనంతో కూడిన పాలన ఉండేందుకు జిల్లా స్థాయి అంబుడ్స్‌మన్ వంటి వ్యవస్థీకృత ఏర్పాట్లను కూడా చేయాలి. అవినీతికి పాల్పడితే వేగంగా, కఠినంగా శిక్షించేందుకు, అధికారం నుంచి తొలగించి, ఆస్తుల జప్తుచేసేందుకు సంస్థాగత నిర్మాణం ఉండాలి. అటువంటి వ్యవస్థలో, అధికారం, జవాబుదారీతనం కలగలిసి – ఓటర్లు, పన్ను చెల్లింపుదారులు తమకు దక్కాల్సింది ఒక హక్కుగా పొందగలుగుతారు. పౌరులు పాలనలో భాగస్వాములు కాగలుగుతారు.

**హెరాల్డ్:** రాజకీయ చర్చకువాస్తవాలతో సంబంధం లేకుండా పోయిందని మీరన్నారు. అదెలా? భారత రాజకీయాలలో వాస్తవమేమిటి? ప్రజల ఆకాంక్షలు మరింత వాస్తవికంగా ఉండాలంటే ఏం చేయాలి?

**జేపీ:** భారతదేశంలో మనకు కావలసింది ఆధారాలు, తార్కికత ఉన్న 'హేతుబద్ధ' బహిరంగ చర్చ. కానీ మితిమీరిన భావోద్వేగాలు, అతి తక్కువ తర్కమే మనకు కనిపిస్తుండటం విచారకరం. కాసిని నిజాలు, బోలెడన్ని ఊహాగానాలు, రొడ్డకొట్టుడు వాదనలు, సంశయలాభం (బెనిఫిట్ ఆఫ్ డౌట్) ఎదుటివారికి ఇవ్వటానికి చాలా సందర్భాలలో ఇష్టపడక పోవటం – ఇవే మన ధోరణుల్ని శాసిస్తున్నాయి. అనేక అంశాలలో, తాను చెల్లించే తాత్కాలిక రాజకీయ మూల్యానికి, పెంపొందించాల్సిన దీర్ఘకాలిక ప్రజా ప్రయోజనాలకీ మధ్య ఘర్షణలో రాజకీయవేత్త మునిగి తేలుతున్నాడు. క్రూరనిర్ణయాలను ప్రేరేపించే ఈ వాతావరణంలో తీసుకునే నిర్ణయాలు గాడితప్పి తాత్కాలిక ధోరణులు పెచ్చరిల్లుతున్నాయి. చమురు సబ్సిడీలు, ఉచిత విద్యుత్తు, తాత్కాలిక ఉచితాలు – ఇవన్నీ తాత్కాలిక రాజకీయ లబ్ధి కోసం చేస్తున్నవే. ఫలితంగా, పేదరికాన్ని తగ్గించి, ఆదాయాల్ని పెంచేందుకు కావలసిన మౌలిక వసతులు, విద్య, నైపుణ్యాలు, ఆరోగ్యసేవలు వంటివి తరచూ నిర్లక్ష్యానికి గురవుతున్నాయి.

**హెరాల్డ్:** ప్రభుత్వంలో అవినీతిపై ఇటీవల కొన్ని నెలలుగా అన్ని వైపుల నుంచీ పెద్దఎత్తున ఆగ్రహావేశపు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కానీ అదేసమయంలో, చర్చలకు అవకాశం లేకుండా, కీలకమైన బిల్లులు ఆమోదం పొందే అవకాశం లేకుండా పార్లమెంటును ఏకబిగిన స్తంభింపచేస్తున్నారు. భారతదేశపు రాజకీయవేత్తలు దేశం కోసం, ప్రజల కోసం పనిచేస్తున్నారా, లేక టీవీ చర్చల్లో లభించే కొన్ని క్షణాల గుర్తింపు కోసం ఎగబడుతున్నారా?

**జేపీ:** బలమైన అవినీతి నిరోధక వ్యవస్థను ఏర్పాటు చేయటంలో ఆలస్యానికి దానితో ముడిపడి వున్న అంశాలలోని జటిలత్వం కూడా కొంత కారణం. పరస్పర విరుద్ధమైన ప్రయోజనాల్ని ఒక తాటి మీదకు తేవటం, అనేక ఇతర సంస్థల్ని సమన్వయం చేయాల్సిరావటం వంటి వాటికి కొంతసమయం పట్టొచ్చు. అయితే, బలమైన అవినీతి నిరోధక వ్యవస్థ ఏర్పడకుండా రాజకీయవేత్తలు, ఉన్నతాధికారులు అడ్డంకొడుతుండటం కూడా జాప్యానికి ఖచ్చితంగా కారణం. పూర్తిగా జవాబుదారీతనంతో ఉండటానికి ఇష్టపడక కావచ్చు లేక ప్రతి విషయంలో అనుమానితులుగా ఉంటామనే భయంతో లేక స్వతంత్ర పర్యవేక్షణ కిందకి రావటానికి ఇష్టం లేకకావచ్చు, రాజకీయవేత్తలు, ఉన్నతాధికారులు గట్టి అవినీతి నిరోధక వ్యవస్థ ఏర్పాటుకి గండికొడుతున్నారు. అయితే, మీడియా, ప్రజల ఒత్తిడి ఉండటం వల్ల త్వరలోనే బలమైన లోక్‌పాల్ చట్టం వస్తుందని నాకు విశ్వాసం ఉంది. కానీ, విచారకరమైనదేమంటే, ఇప్పటికే లోక్‌పాల్ బిల్లులో మనం కొంత నష్టపోయాం. ఉదాహరణకి, పౌరసమాజ నాయకత్వం వల్ల కొంత, రాష్ట్రాల హక్కులకు నష్టం అనే మూర్ఖపు వాదన లేవనెత్తిన రాజకీయ పార్టీల వల్ల కొంత లోక్‌పాల్ బిల్లులోని లోకాయుక్త ఛాప్టర్‌ని ఇప్పుడు తొలగించారు. దీనివల్ల మనం ప్రతి రాష్ట్రంలో లోకాయుక్త కోసం మళ్లీ పోరాడాల్సి ఉంటుంది.

**హెరాల్డ్:** మన రాజకీయ ముఖచిత్రంలో ముక్కచెక్కల్లాంటి అనేక పార్టీలు ఉన్నాయి. దీనివల్ల దేశానికి మేలా, చెరుపా?

**జేపీ:** రాజకీయ విచ్ఛిన్నత అనేది నిస్సందేహంగా మంచిది కాదు. ఇది అస్తిత్వ రాజకీయాలను ప్రోత్సహించి రాజకీయాలను అస్థిర పరుస్తుంది. అయితే ఈ పరిస్థితికి ప్రధాన జాతీయ పార్టీలే కారణం. ఆ పార్టీలకు ముందుచూపు, నాయకత్వం, విశ్వసనీయత, సృజనాత్మకత లేకపోవటం వల్లే దేశంలో రాజకీయం విచ్ఛిన్నమవుతోంది. స్థానిక సాధికారత, ఎన్నికల సంస్కరణలు సహా రాజకీయ సంస్కరణల్ని చేపట్టటమే ఈ సంక్షోభానికి పరిష్కారం. కాంగ్రెస్, బీజేపీలు మొద్దునిద్ర నుంచి బైటపడి దేశాన్ని ముందుకు నడిపించటంపై దృష్టి పెట్టాలి.

**హెరాల్డ్:** సంకీర్ణ రాజకీయాలు అనివార్యంగా మారినా, వాటిలోని వైరుధ్యాల్ని అధిగమించటం పెద్దసవాలుగా మారింది. ఈ నేపథ్యంలో, మూడో ఫ్రంట్ ఎంత వరకూ ఆచరణ సాధ్యం?

**జేపీ:** ప్రభుత్వం స్థిరంగా కొనసాగాలంటే, సమగ్రమైన, ఆచరణసాధ్యమైన ఎజెండా కలిగి, ఆటనియమాలకు కట్టుబడి పనిచేసే ఒక జాతీయపార్టీ కేంద్రబిందువుగా ఉండాలి. రాబోయే కొన్నేళ్లపాటు జాతీయస్థాయిలో మనకు సంకీర్ణాలు తప్పవు. అయితే, పెద్ద జాతీయపార్టీలలో ఏదోకదాని చుట్టూనే సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుచేయటం వాంఛనీయం.

**హెరాల్డ్:** వచ్చే ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి ఎలా ఉండొచ్చు? జగన్ ప్రభావాన్ని ఆ పార్టీ ఎదుర్కోగలదా?

**జేపీ:** మనం వేచిచూడాల్సిందే. జాతీయ పార్టీలు నానాటికీ దిగజారుతున్న పరిస్థితికి ఆంధ్రప్రదేశ్ అద్దం పడుతుంది. అర్థవంతమైన రాజకీయ సంస్కరణలు లేనప్పుడు, ప్రాంతీయ శక్తులు బాధ్యతారహిత తాత్కాలిక పథకాలతో, పెద్దఎత్తున ఆర్జించిన అక్రమ సంపాదన, వనరులతో తేలిగ్గా రాజకీయాన్ని దిగజార్చి అధికారాన్ని తమ గుప్పెట్లోకి తెచ్చుకోగలుగుతాయి. ఇప్పుడు మనం చూస్తున్నదదే. పాత పాపాలు పెద్ద నీడలై వెంటాడుతున్నాయి. అవినీతితో సంపాదించిన, లెక్కలు చూపని డబ్బు రాజకీయాలలో 'మామూలే' అని అంగీకరిస్తే, ఇక సంపన్నులు, ప్రజాధనాన్ని కొల్లగొట్టినవారే అగ్రస్థానానికి ఎదుగుతారు. పెద్ద పార్టీలు తమ ఆత్మవంచనకు, నటనకు స్వస్తిచెప్పి, అర్థవంతమైన, సమగ్రమైన సంస్కరణల కోసం కలిసికట్టుగా పనిచేయాలి. ఆంధ్రప్రదేశ్ పరిణామాల పాఠమిదే. ■

# పిల్లల జీవితాలతో చెలగాటం!

- చదువు పేరుతో రాచిరంపాన పెడుతున్నారు
- విద్యార్థులు ఒత్తిడి భరించలేకపోతున్నారు
- కళాశాలల యాజమాన్యాల్లో కాసుల కక్కుర్తి
- తల్లిదండ్రులకు ర్యాంకుల యావ
- కమిటీ నివేదికను తొక్కేశారు

ఇంటర్ విద్యార్థులపై మానసిక ఒత్తిడి ఇప్పటికే గరిష్ఠ స్థాయికి చేరుకుందని, ఇంకేమాత్రం ఒత్తిడిని భరించే స్థితిలో వారు లేరని ఉన్నత విద్యామండలి మాజీ ఉపాధ్యక్షురాలు ప్రొఫెసర్ నీరదారెడ్డి హెచ్చరించారు. చిన్న వయస్సులోనే వారు తీవ్ర నిర్ణయాలు తీసుకుని తల్లి దండ్రులకు తీరని క్షోభ మిగల్చకుండా ఉండా లంటే ఒత్తిడి తగ్గించే చర్యలను ప్రభుత్వం తక్షణం తీసుకోవాలని స్పష్టం చేశారు. మానసి కోల్లాసాన్ని కలిగించే క్రీడలు, సంగీతం, ధ్యానం వంటివి లేకుండా ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయేంత వరకు బోధన, చదువులు అంటూ బలవంతంగా రుద్దుకుంటూ పోతే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు జీవితాంతం బాధపడాల్సిన పరిస్థితులు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో గట్టి చర్యలను తీసుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నందువల్లే క్రమేణా పరిస్థితులు మరింత జటిలమైపోతున్నాయని పేర్కొన్నారు. ప్రైవేట్ ఇంటర్ కళాశాలల్లోని విద్యార్థుల మానసిక ఒత్తిడి, బోధన, వసతి గృహాల పరిస్థితులపై 2001లో ప్రభుత్వ ఆదేశాలతో విచారణ నిర్వహించిన ప్రత్యేక కమిటీకి నీరదారెడ్డి నేతృత్వం వహించారు. ప్రస్తుత పరిస్థితులు ఆనాటికంటే మరింత దిగజారాయని ఆందోళన వ్యక్తం చేశారు. తమ కమిటీ పలు ముఖ్యమైన ప్రతిపాదనలను నివేదించినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకుండానే తొక్కేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 34 ఏళ్లపాటు అర్థికశాస్త్ర బోధకురాలిగా, ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షురాలిగా బాధ్యతలు నిర్వర్తించిన నీరదారెడ్డి.... ప్రస్తుతం వివిధ విద్యాసంస్థలకు ఆమె సలహాదారురాలిగా వ్యవహరిస్తున్నారు.




**ఇంటర్ కళాశాలల వసతి గృహాల్లో దారుణ పరిస్థితులపై పత్రికలో ఇటీవల ప్రచురితమైన కథనం అక్షర సత్యం అంటున్న నీరదారెడ్డి**

### కుమిలిపోతున్నారు

కళాశాలలను, వసతిగృహాలను 2001లో మేము స్వయంగా సందర్శించాం. హైదరాబాద్, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం, ఇతర నగరాల్లోని ప్రధాన కళాశాలలను స్వయంగా పరిశీలించాం. ఆ సమయంలో అనేక చేదు వాస్తవాలు బయటపడ్డాయి. కళాశాలల కాసుల కక్కుర్తి, తల్లిదండ్రుల మితిమీరిన ఆకాంక్షల వల్ల విద్యార్థులు పడరాని పాట్లుపడుతున్నాయి. పలువురు విద్యార్థుల ఆత్మహత్యలకు దారితీసిన కారణాలపై విశ్లేషించాం. కళాశాలల్లో ప్రత్యేక తరగతుల పేర్లతో విద్యార్థులను రాచి రంపాన పెడుతున్నారు. ప్రతిరోజూ, నెలవారీ పరీక్షలను పెడుతూ విద్యార్థులను వెంటాడుతున్నారు. ఈ ఒత్తిడి గురించి అటు తల్లిదండ్రులకు చెప్పలేక... కళాశాలల నుంచి బయటకు వెళ్లలేక, తమ బాధను ఎవరితో చెప్పుకోవాలో తెలియక విద్యార్థులు పడుతున్న బాధ వర్ణనాతీతం. ఉదయం నుంచి రాత్రి వరకు ఏకబిగిన 15 గంటల వరకు తరగతి గదుల్లో ఉంచడం దారుణం. ఎంసెట్,

ఇతర ప్రవేశ పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేసేందుకు ప్రత్యేక శిక్షణ కేంద్రాలను కళాశాలల్లోనే నిర్వహించారు. దీనివల్ల రెగ్యులర్‌గా ఇంటర్ తరగతులు ఎక్కడ జరుగుతున్నాయో, విద్యార్థులు ఎవరెవరో తెలుసుకోవడం కష్టమయింది.

**విద్యార్థుల ఆత్మహత్యలు**

ఈ కళాశాలల్లో, వారి వసతిగృహాల్లో ఉండలేకపోతున్నట్లు లేఖలు రాసిన విద్యార్థులెంతమందో! “నేను చదువులో మంచి మార్కులను సాధించలేకపోతున్నా. అందుకే చనిపోతున్నా” అని ఓ విద్యార్థిని లేఖ రాసింది. ఈ విషయాన్ని కూడా నివేదికలో ప్రస్తావించాం. స్వల్ప వ్యవధిలోనే ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారు. ఆడపాదడపా ఇలాంటివి జరుగుతూనే ఉన్నాయి. ఈ చదువులుమాకొద్దు అని విద్యార్థులు చెప్పడాన్ని వింటూనే ఉన్నాను. ఇప్పటికైనా మేల్కొకుంటే విద్యార్థుల తీవ్ర నిర్ణయాలు మరింత పెరిగే ప్రమాదం ఉంది.

**వసతిగృహాల్లో వసతుల్లేవు!**

వసతి గృహాల్లో పరిస్థితి దారుణం. విద్యార్థులు ఉన్న గదులను చూసి నిర్ఘాంతపోయాం. వారి బల్లలపై పుస్తకాలతోపాటు కంచాలు కూడా కనిపించాయి. డైనింగ్ హాలులో ఉండాల్సిన వాటిని ఇక్కడ ఎందుకు ఉంచారని ప్రశ్నిస్తే.. వాటికోసం వరుసలో నిలబడే సమయమే ఉండడం లేదని, కంచాలు ఇక్కడే ఉంటే త్వరగా వరుసలో వెళ్లే వీలుంటుందని సమాధానమిచ్చారు. బక్కెట్లు, చెంబులు పోతున్నాయన్న కారణంతో వాటిని తరగతి గదులకు కూడా తీసుకువెళ్లడం మేం గమనించాం. నీటి సమస్య తీవ్రంగా ఉంది. మరుగుదొడ్లు విద్యార్థులకు సరిపడా లేవు. ఇలాంటి సమస్యలు ఇంకా మరెన్నో ఉన్నాయి.

**విభజించడం దారుణం**

విద్యార్థులను శ్రేణులవారీగా విభజిస్తున్నారు. ఇది అత్యంత దారుణం. ఈ పోటీ వాతావరణం వల్ల విద్యార్థుల మధ్య సన్నిహిత సంబంధాలు దెబ్బతింటున్నాయి. ఇలాంటి సంఘటనలు వారిని జీవితాంతం వెంటాడుతాయి. బాగా చదివే వారికన్నా, వెనకబడే వారికే ప్రత్యేక శిక్షణ అవసరం. కానీ కళాశాలల్లో అనుసరిస్తున్న పద్ధతి దీనికి భిన్నం. ప్రతిభావంతులకు ప్రత్యేక శిక్షణ వల్ల కలిగే అదనపు ప్రయోజనం తక్కువే. వారు ఎలాగూ రాణిస్తారు. అయినా ఇది ఎవరూ గమనించడంలేదు. ఎంతమంది పరీక్షలు రాశారు. ఎవరికి ఎన్ని మార్కులు వచ్చాయో కళాశాలల వారు పారదర్శకంగా చెప్పడం లేదు. బాగా మార్కులు వచ్చిన వారి గురించే ప్రస్తావిస్తున్నారు. కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలకు కావల్సింది కాసులు. తల్లిదండ్రులకు కావల్సింది ర్యాంకులు, మార్కులు. ఈ పరిస్థితుల్లో ఇప్పటికీ ఎటువంటి మార్పు కనిపించలేదు.

**పనిచేయని ఇంటర్ బోర్డు**

కళాశాలలకు అనుమతులను మంజూరు చేసే ఇంటర్ బోర్డు వద్ద నియమ నిబంధనలు స్పష్టంగా ఉన్నా వాటిని ఎవరూ ఆచరించరు. మా కమిటీని అప్పటి విద్యామంత్రి ఏర్పాటు చేసినప్పుడు ఇంటర్ బోర్డు కార్యదర్శిగా శ్రీనివాసరావు ఉన్నారు. పరిశీలన కోసం జీవోల ప్రతులు ఇవ్వాలని కోరగా నిరాకరించారు. విలేకర్ల వద్ద తీసుకోవాలని సలహా ఇచ్చారు. దీనిపై తీవ్రస్థాయిలో శాసనసభలో చర్చ జరిగింది. ఆ తరువాత ఆయన్ని బదిలీ చేశారు. జిల్లాల్లో ఉండే ఆర్ఐఓల వ్యవస్థ సక్రమంగా లేదు. నిర్దేశించిన సంఖ్య కన్నా ఎక్కువగా చేర్చుకుంటున్నా అడిగేవారు లేరు. విద్యాసంస్థల సొసైటీల పేర్లను రాత్రికి రాత్రే మార్చేసినా, కళాశాలలను ఒకచోట నుంచి మరొక చోటకు తరలించినా అడిగే వారు ఇంటర్ బోర్డులో లేనేలేరు. వీటిని ఆధారాలతో సహా మా కమిటీ ప్రభుత్వానికి నివేదించింది. ఇలా చెప్పుకుంటూపోతే ఇంటర్ బోర్డు లీలలకు అంతే ఉండదు. ప్రభుత్వ కళాశాలల అధ్యాపకులు ప్రైవేట్ కళాశాలల్లో కనిపిస్తున్నారు.

**నాలుగు గోడల మధ్య అధ్యయనం జరిగితే ఏం తెలుస్తుంది?**

పత్రికల్లో వార్తలు రావడంతో పాఠశాలలు, జూనియర్ కళాశాలల రుసుములు నియంత్రణ గురించి ప్రత్యేక మంత్రివర్గ ఉపసంఘం పరిశీలన చేయబోతుందని తెలిసింది. మంత్రివర్గ ఉపసంఘం ఏయే అంశాలపై అధ్యయనం చేయబోతుందో తెలియదు. నాలుగు గోడల మధ్య కూర్చొని అధ్యయనం చేస్తే ప్రయోజనం ఉండదు. వివిధ రంగాలకు చెందిన వారితో ప్రత్యేక కమిటీలను నియమించి కళాశాలలను సందర్శించేలా చేసి, వారి అభిప్రాయాలు తెలుసుకున్న అనంతరం విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటే కొంతవరకైనా సత్ఫలితాలు కనిపిస్తాయి. మా కమిటీ నివేదిక మాదిరిగానే వాటిని తుంగలో తొక్కేస్తే ఉపయోగమే ఉండదు.

**ఆరేడు రెట్లు ఎక్కువగా వసూలు**

కళాశాలల్లో రుసుముల నియంత్రణ అన్నది లేదు. బోర్డు పేర్కొన్న దానికి ఆరేడు రెట్లు ఎక్కువగా వసూలు చేయడం గమనించాం. ఇప్పుడు పరిస్థితులు మరింతగా చేయి దాటాయి. రుసుములు భరించలేక తల్లిదండ్రులు పడే క్షోభ అంతా ఇంతా కాదు. అయినా ప్రభుత్వం వైపు నుంచి సరైన చర్యలే లేవు.

**నీరదారెడ్డి కమిటీ సిఫార్సులు**

- ఇంటర్ విద్యకు, ఎంసెట్ వంటి ప్రవేశ పరీక్షల శిక్షణకు సంబంధం ఉండకూడదు.
- ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు పుస్తకాలతో విద్యార్థులు కుస్తీపడేలా చేయకూడదు.
- విద్యార్థుల్లో మానసిక ఒత్తిడిని పెంచేలా బోధన, సెల్ఫ్‌స్టడీ ఉండకూడదు.
- మానసికోల్లాసాన్ని కలిగించేలా క్రీడలు నిర్వహించాలి. కాసేపు మెడిటేషన్ చేయించాలి. విడిగా గ్రంథాలయ పీరియడ్లను నిర్వహించాలి.
- ప్రథమ, ద్వితీయ సంవత్సర విద్యార్థులు విడివిడిగా ప్రాక్టికల్స్ నిర్వహించేలా సౌకర్యాలు ఉండాలి.
- విద్యార్థులను మార్కుల ప్రాతిపదికన విభజించనేకూడదు.

  వసతి గృహాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి. రుసుముల నియంత్రణ జరగాలి.
- విద్యార్థులు మానసికంగా తీవ్రస్థాయిలో ఒత్తిడికి గురికావడంలో తల్లిదండ్రుల పాత్ర 50% వరకు ఉంది.
- విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించేందుకు ప్రతి కళాశాలలో, వసతి గృహంలో అర్హతలున్న కౌన్సిలర్ (కనీసం ఆరునెలలు)ను నియమించాలి.
- కళాశాలలను పరస్పరం కొనుగోలు చేయటానికి, స్థలం మార్చేందుకు అనుమతి ఇవ్వకూడదు.
- అనుమతులు పొందినే ప్రకారమే కళాశాలల్లో విద్యార్థులను చేర్చుకునేలా చూడాలి.
- కళాశాలల యాజమాన్యాలు నెలకొకసారి విద్యార్థుల ప్రతిభ గురించి వారి తల్లిదండ్రులకు వివరించాలి.
- విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం, విజయావకాశాలను మెరుగుపరిచేలా నిపుణుల ద్వారా ప్రసంగాలను ఇప్పించాలి.
- బాలికలు మాత్రమే విద్యను అభ్యసించే కళాశాలలో మహిళా అధ్యాపకులను మాత్రమే నియమించాలి.
- విద్య, సైకాలజీ, అధ్యాపక పద్ధతులపై అధ్యయనం (పెడగాజీ), ఇతర రంగాలకు చెందిన నిపుణులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలి. కళాశాలల్లో బోధన, ఇతర అంశాలను ఈ కమిటీ నిరంతరం గమనిస్తూ.. రాష్ట్ర ప్రభుత్వానికి, ఆయా సంస్థలకు అవసరమైన సలహాలు ఇవ్వాలి.

మానసిక ఒత్తిడికి తట్టుకోలేక ఓ విద్యార్థి ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆ అమ్మాయి చనిపోయేముందు రోజు.. "మీరు కనుక రేపు మధ్యాహ్నం మూడు గంటలలోగా రాకపోతే నేను చనిపోతా" అని తల్లిదండ్రులను హెచ్చరించింది. దీంతో భయపడి వారు వసతి గృహం వద్దకు వచ్చారు. సందర్శకుల సమయం ఇది కాదని వారిని బయటే ఉంచేశారు. ఆ అమ్మాయి ముందుగా చెప్పినట్లే చనిపోయింది. ఆ తల్లిదండ్రులను మేము కలిసినప్పుడు విలవిలలాడిపోయారు. ఆ సంఘటనను ఇప్పటికీ మరచిపోలేక పోతున్నాను. మార్కుల్లో కాస్త వెనకబడే విద్యార్థులను వేరే బ్యాచ్‌గా విడగొట్టడం ఎంతవరకు సబబు? 15 నుంచి 17 సంవత్సరాల మధ్య ఉండే విద్యార్థులను భుజం తట్టి ప్రోత్సహించాల్సింది పోయి.. మీరు పనికిరారంటూ వేరే తరగతిలోకి మార్చేస్తే వారెంత మానసిక వేదనకు గురవుతున్నారో ఆలోచిస్తున్నారా?

కళాశాలల యాజమాన్యాలు.. మంచి మార్కులు సాధించే విద్యార్థులను తీసుకొచ్చినందుకు మధ్యవర్తులకు ఫ్రిజ్‌లు, ఇతర ఖరీదైన వస్తువులను ఇస్తున్నాయి. ■

# సర్కారీ బడులిలాగే ఉంటాయ్!

## 30 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పులో 81 మంది చిన్నారులు

సర్కారు బడులు ఇలా విశాలంగా... అద్భుతంగా కూడా ఉంటాయి... ఇక ఇలాగే ఉంటాయి అంటూ ప్రభుత్వ ఘనతను చాటేలా ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఫొటోతో రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారాన్ని ఆరంభించింది. ఈ నెల 22వ తేదీ నుంచి విద్యా పక్షోత్సవాలను భారీ ఎత్తున నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ ప్రచారానికి తెరతీసింది. రూ. 5 వేల కోట్లతో పాఠశాలలను అభివృద్ధి చేస్తామని చెబుతోంది. కానీ వాస్తవం చేదుగా ఉంది. హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ప్రాథమిక పాఠశాల దుర్భర స్థితిని చూస్తే ఇది అర్థమవుతుంది. బేగంపేట మయూరిమార్గ్‌లోని అల్లంతోట బావిలో దశాబ్దాల నుంచి ఈ పాఠశాల కనీస సౌకర్యాలకు దూరంగా కొనసాగుతోంది. ఆ పాఠశాలలో కనిపించిన దృశ్యాలు ఆవేదన కలిగిస్తున్నాయి. కేవలం 30 అడుగుల పొడవు, 20 అడుగుల వెడల్పు ఉన్న చీకటి గదిలో 81 మంది విద్యార్థులు చదువు సాగిస్తున్నారు. ఒకటి నుంచి 5వ తరగతి వరకూ అందరికీ విద్యాభ్యాసం పక్కపక్కనే కొనసాగుతోంది. వీరికి మరుగుదొడ్డి సౌకర్యం లేదు. తాగునీటి సౌకర్యం అంతంత మాత్రమే. మధ్యాహ్న భోజనం పెట్టే గదిలోనే మధ్యాహ్న భోజనానికి సంబంధించిన సామాగ్రి దర్శనమిస్తోంది. మరోపక్క ఈ పాఠశాల ప్రధాన రహదారి వెంటే ఉంది. దీనివల్ల అటుఇటువెళ్లే వాహనాల రణగొణ ధ్వనుల గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. ఇక్కడ చదివే వారంతా కూలీనాలీ చేసుకునే తల్లిదండ్రుల పిల్లలే. ఈ పాఠశాల ఓ కమ్యూనిటీ హాలులో దశాబ్దాల నుంచి కొనసాగుతుండటం గమనార్హం. వినాయక ఉత్సవాల వంటి సమయంలో ఈ పాఠశాల ఏకంగా మరోచోటకు తరలిపోతుంది. వర్షం వస్తే ఈ గదంతా చిత్తడిచిత్తడే. కిటికీలకు తలుపులు లేవు. అట్టముక్కలు పెట్టారు. పాఠశాలల్లోని ఇలాంటి అసౌకర్యాలే విద్యార్థులను సర్కారీ పాఠశాలలకు దూరం చేస్తున్నాయి. రాజీవ్ విద్యామిషన్ కింద వేలాది కోట్ల రూపాయలను ఏటా వ్యయం చేస్తున్నారు. ఇందులో ముఖ్యంగా నిర్మాణ పనులకే ఎక్కువ భాగం వెచ్చిస్తున్నారు. అయినా నగర నడిబొడ్డున అందరికీ కనిపించే ఈ పాఠశాల గురించి ఎవరికీ పట్టడం లేదు. విద్యాశాఖ తాజా లెక్కల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 6,072 పాఠశాలలకు మరుగుదొడ్లు లేవు. 9 వేల పాఠశాలలకు తాగునీటి సౌకర్యం లేదు. ■





పాఠశాల ఉంది ఈ కమ్యూనిటీ హాల్లోనే...

# ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించకుండా ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల మూసివేత తగదు

రాష్ట్రంలో పాఠశాల విద్య దయనీయ స్థితిలో ఉన్న తరుణంలో 10మంది కంటే తక్కువ పిల్లలున్న 3,193 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను, విద్యాహక్కు చట్టం నిబంధనలు పాటించలేక రిజిస్ట్రేషన్ చేయించుకోని 4000 పాఠశాలలను మూసివేయాలనే ప్రభుత్వ నిర్ణయం పూర్తిగా అనాలోచితమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వి.వి.ఎస్ వర్మ అన్నారు. ఇదే జరిగితే దాదాపు 2లక్షలమంది పిల్లలకు అందుబాటులో బడి లేకుండాపోయే లేదా తక్కువ ఖర్చుతో చదువుకునే వీలులేక చదువు దూరమయ్యే ప్రమాదం పొంచివుంటుందన్నారు. ఇది పేదలు, సామాన్యుల పిల్లలకచదువుకు శరాఘాతమవు తుందన్నారు.

"ప్రభుత్వ గణాంకాల ప్రకారం, రాష్ట్రంలో 10మందిలోపు పిల్లలున్న ప్రాథమిక పాఠశాలలు 11,000 కాగా 20మందికి లోపు ఉన్న పాఠశాలలు 17,000గా ఉన్నాయి. ఒక్క ఉపాధ్యాయుడు కూడా లేని పాఠశాలలు 5,774 కాగా ఒక్కరే ఉపాధ్యాయుడు ఉన్న పాఠశాలలు 15,170, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలలు 23,416గా ఉన్నాయి. ఇందులో 10లోపు పిల్లలున్న పాఠశాలలకు ప్రభుత్వం ఈ సంవత్సరం మూసివేయాలని ఉత్తర్వులు జారీచేసింది. వచ్చే సంవత్సరం మరో 6వేల పాఠశాలలు ఇదేదారి పట్టే స్థితి ఉంది" అని వర్మ పేర్కొన్నారు.

**ENROLLMENT IN GOVT SCHOOLS**

| District | ps 0-10 | ps 0-20 | ps 0-25 | ups 0-10 | ups 0-20 | ups 0 -25 |
|---|---|---|---|---|---|---|
| Adilabad | 449 | 718 | 966 | 30 | 121 | 174 |
| Anathapur | 642 | 1089 | 1463 | 80 | 229 | 300 |
| Chittor | 875 | 1609 | 2344 | 62 | 237 | 322 |
| East godavari | 561 | 853 | 1154 | 12 | 44 | 67 |
| Guntur | 437 | 618 | 953 | 33 | 87 | 130 |
| Hyderabad | 285 | 296 | 306 | 10 | 11 | 11 |
| karimnagar | 789 | 1152 | 1650 | 30 | 115 | 171 |
| Khammam | 411 | 733 | 995 | 47 | 173 | 243 |
| krishna | 445 | 697 | 1044 | 52 | 169 | 232 |
| Mahabubnagar | 692 | 979 | 1248 | 43 | 120 | 179 |
| Medak | 584 | 779 | 954 | 25 | 100 | 161 |
| NALGONDA | 674 | 1009 | 1380 | 19 | 71 | 110 |
| NELLORE | 439 | 799 | 1289 | 82 | 263 | 338 |
| NIZAMABAD | 167 | 374 | 547 | 37 | 106 | 136 |
| PRAKASAM | 462 | 663 | 891 | 42 | 106 | 158 |
| RANGREDDY | 509 | 626 | 733 | 20 | 70 | 99 |
| VISHAKAPATNAM | 370 | 711 | 1025 | 35 | 123 | 170 |
| west godavari | 431 | 632 | 904 | 17 | 37 | 59 |
| SRIKAKULAM | 477 | 908 | 810 | 36 | 177 | 228 |
| KADAPA | 469 | 829 | 931 | 61 | 175 | 151 |
| VIZAYANAGARAM | 295 | 558 | 534 | 8 | 45 | 68 |
| **SUM TOTAL** | **10463** | **16632** | **22121** | **781** | **2579** | **3507** |

*Note: Data for kurnool district not found*
*ps:primary school*
*ups: Upper primary school*

# రాజకీయ పార్టీలను సమాచార పరిధి నుంచి తప్పించే కుట్రపై పోరాడతాం: లోక్‌సత్తా

తమ కార్యకలాపాల గురించి తెలుసుకునే హక్కు ప్రజలకు లేకుండా చేసేందుకు రాజకీయ పార్టీలు చేస్తున్న ప్రయత్నం ప్రజాస్వామ్యానికి, ఓటర్లకు వ్యతిరేకంగా చేస్తున్న కుట్రేనని లోక్‌సత్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.

పార్టీలను సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) పరిధి నుంచి తప్పించేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు ముందుకొచ్చినవారితో కలిసి లోక్‌సత్తా పోరాడుతుందని, కేంద్ర సమాచార కమిషన్ ఆదేశాలను న్యాయవ్యవస్థ సమర్థిస్తుందనటంలో తనకెలాంటి సందేహంలేదని జేపీ అన్నారు.

రాజకీయ పార్టీలు ప్రైవేటు ఆస్తులు కావని, పౌరుల రాజకీయ భాగస్వామ్యానికి అవి వాహకాలు మాత్రమేనని జేపీ స్పష్టంచేశారు. స్వచ్ఛంద సంస్థ లేదా సామాజిక బృందం కంటే ఒక రాజకీయ పార్టీ భిన్నమైనదేమీ కాదన్నారు. ఒక ఉమ్మడి ప్రయోజనం కోసం పౌరులు స్వేచ్ఛగా ఏర్పాటుచేసుకున్నదే రాజకీయ పక్షమన్నారు. ప్రభుత్వం నుంచి చెప్పుకోదగిన సహాయాన్ని అందుకుంటున్న స్వచ్ఛంద సంస్థలన్నీ ఆర్టీఐ చట్టం పరిధిలోకి వస్తాయన్నారు. చెప్పుకోదగిన సహాయం అంటే ఏమిటో తాను సభ్యుడిగా ఉన్న పాలనా సంస్కరణల సంఘం స్పష్టంగా నిర్వచించిందని, రూ. 1కోటి లేదా అంతకంటే ఎక్కువ లేదా సంస్థ కార్యకలాపాల బడ్జెట్‌లో 50శాతం సహాయాన్ని అందుకుంటే గణనీయ సాయంగానే పరిగణించాలన్నారు.

ప్రజల ఓట్లు కోరుతూ, అధికారాన్ని ఆశిస్తూ, ప్రజాధనాన్ని ప్రభుత్వం వినియోగించే తీరును ప్రభావితం చేస్తూ, చట్టనిర్మాణంలో భాగస్వామి అవుతుంది కాబట్టి ఒక రాజకీయ పార్టీ స్వచ్ఛంద సంస్థ కంటే కూడా ఎక్కువని జేపీ అన్నారు. శాసనసభ, ఎన్నికల రాజకీయాలకు వెలుపల చిన్న పార్టీలు కూడా ప్రజల జీవితాలపై అపార ప్రభావాన్ని చూపుతుంటాయన్నారు. బంద్‌లు, ఇతర ఆందోళనల ద్వారా ప్రజాజీవితాన్ని, ఆర్థిక కలాపాల్ని స్తంభింపచేయగలవన్నారు. ఆర్టీఐ చట్టం పరిధి నుంచి తమను తప్పించాలని రాజకీయ పార్టీలు కోరటం అర్థరాహిత్యానికి పరాకాష్ఠ అన్నారు.

రాజకీయ పార్టీలను ఆర్టీఐ పరిధిలోకి తేవటమంటే వాటి అంతర్గత చర్చలను, వ్యూహాలను బహిరంగపరచమని కాదని జేపీ అన్నారు. కానీ పార్టీ సభ్యత్వ నమోదు, నేతల ఎన్నిక, ఎన్నికలలో అభ్యర్థుల ఎంపిక, నిధుల సేకరణ నిబంధనలు, ప్రమాణాల గురించి తెలుసుకునే హక్కు ప్రజలకుందన్నారు. తాము చెబుతున్న విధానాలకు ప్రాతిపదిక ఏమిటో, వాటిని అమలు చేసేందుకు తాము నిధుల్ని ఎలా సేకరిస్తామో చెప్పాల్సిన బాధ్యత రాజకీయ పార్టీల మీద ఉందని జయప్రకాష్ నారాయణ్ విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ■

---

పిల్లలు రాక, ఉపాధ్యాయులు లేక పాఠశాల విద్య కునారిల్లుతున్న దశలో విద్యాహక్కు చట్టం పేరుతో నెలకు 500 రూపాయలలోపు తక్కువ ఫీజులతో సామాన్యులకు అందుబాటులో ఉన్న 4000 బడ్జెట్ పాఠశాలలను మూసివేయడంతో రాష్ట్రంలో పాఠశాల విద్య స్థితి మరింత దిగజారుతుందని వర్మ అన్నారు.

ఒకపక్క విద్యావలంటీర్లతో పాఠశాలలను నడిపిస్తున్న ప్రభుత్వం మరోపక్క ఈ బడ్జెట్ పాఠశాలలకు అర్హతలు – జీతాలు – విస్తీర్ణాలకు కొలబద్దలు ఏర్పాటు చెయ్యడంతో అటు కార్పొరేట్ పాఠశాలలు, ఇటు ప్రభుత్వ పాఠశాలలు మాత్రమే మిగిలే స్థితి కల్పించబడిందని వర్మ పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించడానికి వీలుగా ఈ విద్యాసంవత్సరంలో ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్ని యధావిధిగా కొనసాగించాలని వర్మ కోరారు. నిబంధనల పేరుతో కార్పొరేట్ పాఠశాలలవైపు పిల్లల్ని తరలించడానికి బదులు ప్రభుత్వం పాఠశాలల్ని నిర్వహించలేనిచోట ప్రత్యామ్నాయంగా ఆ పిల్లలకు నగదు బదిలీ పథకం ప్రవేశపెట్టి తక్కువ ఫీజులతో నిర్వహించే ప్రయివేటు బడ్జెట్ పాఠశాలలను వినియోగించుకోవాలన్నారు. ఈ పాఠశాలలకు తగిన ప్రత్యేక అర్హతలు, విధివిధానాలు రూపొందించాలన్నారు. అందుకు ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని డి.వి.వి.ఎస్ వర్మ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ■

# తాగునీరు ఎంత దూరం?

- సగం జనాభాకు రక్షిత మంచినీరు కరవు
- బావులు, చెలిమలు, వాగులే దిక్కు
- గ్రామీణ ప్రాంతాల్లో దుర్భర పరిస్థితులు
- గిరిజనులకు మైళ్లకొద్దీ నడక

| ఇదీ పరిస్థితి | |
|---|---|
| రాష్ట్రంలో గ్రామీణ ప్రాంత కుటుంబాలు | 1,42,46,309 |
| కుళాయి ద్వారా శుద్ధిచేసిన నీరు లభిస్తున్న కుటుంబాలు | 51,81,996 |
| శుద్ధి చేయకుండా కుళాయి నీరు లభిస్తున్నవి | 38,50,500 |
| మూతలేని బావులపై ఆధారపడినవి | 11,15,890 |
| బోర్లపై ఆధారపడినవి | 35,89,571 |
| ఊటలపై ఆధారపడినవి | 97,295 |
| కాలువలు/వాగులుపై ఆధారపడినవి | 62,042 |
| చెరువులపై ఆధారపడినవి | 49,198 |

గుక్కెడు మంచినీళ్ల కోసం మైళ్లకొద్ది నడక తప్పడం లేదు. రాష్ట్రంలో ఇప్పటికీ లక్షలాదిమందికి తాగునీరు తీవ్ర సమస్యగానే ఉంది. రాష్ట్ర జనాభాలో సగం మందికి కూడా రక్షిత మంచినీరు అందుబాటులో లేకపోవటంతో అనేక కుటుంబాలకు బావులు, వాగులు, వంకలే శరణ్యమవుతున్నాయి. ఏటా వందల కోట్ల రూపాయలు వ్యయం చేస్తున్నా తాగునీటి సమస్యకు పరిష్కారం లభించడం లేదు. ఇప్పటికీ సాధారణ పరిస్థితుల్లో 25,899 గ్రామాల్లో తాగునీరు పరిమితంగానే లభ్యమవుతోంది. వేసవిలో ఈ సంఖ్య మరిత పెరిగిపోతోంది. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతంలో 1.42 కోట్ల కుటుంబాలు ఉండగా శుద్ధి చేసిన రక్షిత మంచినీరు 51 లక్షల కుటుంబాలకే అందుబాటులో ఉంది. అంటే 91 లక్షల కుటుంబాలకు సురక్షితంగా లేని నీరే దిక్కవుతోంది. అటవీ, కొండ ప్రాంతాల్లో నివసించే గిరిజనులు అత్యధికంగా వాగులు, వూటలు, కొండలపై నుంచి వచ్చే నీటిపైనే ఆధారపడుతున్నారు. 2011 జనగణన ద్వారా ఈ వివరాలు వెల్లడయ్యాయి.



చెలిమలో నీరు పట్టుకుంటున్న దృశ్యం

### ఎంతో దూరం వెళ్లాల్సిందే

తాగునీటికి గ్రామాల్లో మైళ్ల దూరం వెళ్లాల్సి వస్తోంది. 34 లక్షల కుటుంబాలు మంచినీళ్ల కోసం కిలోమీటరుకంటే ఎక్కువ దూరం నడుస్తున్నాయి. ముఖ్యంగా గిరిజనులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెలమలు, వాగులు, గెడ్డలపైనే వారు ఆధారపడుతున్నారు. వేసవిలో వూటజలాల కోసం మైళ్ల దూరం నడుస్తున్నారు. వర్షాకాలంలో బురదనీరే వారికి శరణ్యమవుతోంది. విశాఖపట్నం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో 61 వేల కుటుంబాలు తాగునీటికి వూటలు, చెలిమలపై ఆధారపడ్డాయి. ఇందులో కూడా 51 వేల కుటుంబాలు కనీసం కిలోమీటరు దూరం నడిస్తే కానీ బిందె నీరు కూడా దక్కదు. శ్రీకాకుళం, విశాఖపట్నం, వరంగల్, ఖమ్మం, విజయనగరం, తూర్పుగోదావరి, కరీంనగర్, ఆదిలాబాద్, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో ఇప్పటికే వేల కుటుంబాలు తాగునీటికి బావులపైనే ఆధారపడి ఉన్నాయి. ■

# ప్రభుత్వమే మద్యం దుకాణాల్ని నిర్వహించాలి
# 2 నుంచి బెల్టుషాపులపై ప్రత్యక్ష కార్యాచరణ

గత ఏడాది మద్యం లాటరీ విధానాన్నే 2013-14లో కొనసాగిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన తాజా ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని, రాష్ట్రంలో అక్రమ మద్యందుకాణాలైన బెల్టుషాపులు లేకుండా మద్యనియంత్రణ అమలు జరిగేందుకు వీలుగా ప్రభుత్వమే మద్యం రిటైల్ వ్యాపారాన్ని నిర్వహించాలని లోక్‌సత్తా ఆధ్వర్యంలో ఇక్కడ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన అఖిలపక్ష రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రతిపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. ఎన్నికల సంవత్సరం కావటంతో ఈ ఏడాది మద్యం దుకాణాలు ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో ఉండటం వల్ల మద్యం ఏరులై పారుతుందని పేర్కొన్నాయి. ప్రభుత్వం తన తాజా మద్యం విధానాన్ని వెనక్కి తీసుకోకపోతే, జులై 1వ తేదీన అన్ని పార్టీలూ జిల్లా కేంద్రాలలోని ఎక్సయిజ్ కార్యాలయాల ముందు ధర్నాలు నిర్వహించాలని, జులై 2నుంచి ఉమ్మడిగా లేదా ఏ పార్టీకి ఆ పార్టీ బెల్టుషాపుల తొలగింపునకు ప్రత్యక్ష కార్యాచరణను చేపట్టాలని నిర్ణయించినట్టు సమావేశంలో పాల్గన్న ప్రతిపక్ష పార్టీలు ప్రకటించాయి.






# లోక్‌సత్తా రౌండ్‌టేబుల్ లో ప్రతిపక్షాల పార్టీల పిలుపు

'బెల్టుషాపులు-మద్యం విధానం-ఉమ్మడి కార్యాచరణ'పై లోక్‌సత్తా పార్టీ ప్రధాన కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అఖిలపక్ష సమావేశంలో కాంగ్రెస్, సి.పి.ఐ, సి.పి.ఎం, ఆర్.ఎస్.పి, ఫార్వర్డ్ బ్లాక్, వెల్ఫేర్ పార్టీల ప్రతినిధులు పాల్గన్నారు.

తొలుత కటారి శ్రీనివాసరావు మాట్లాడుతూ... రాష్ట్రంలోని మద్యం బెల్టుషాపుల్ని నెలరోజుల్లో మూసివేయిస్తామని మే 5, 2013న ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్ రెడ్డి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి జైరాం రమేష్ సమక్షంలో ప్రకటించారని, ఇప్పటికి నెలన్నర గడిచిపోయినా బెల్టుషాపులు యధాతథంగానే కొనసాగుతున్నట్టు తమ శాంపిల్ సర్వేలో తేలిందని అన్నారు. వేలం విధానమైనా, లాటరీ విధానమైనా మద్యం వ్యాపారం ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో ఉంటే బెల్టుషాపులు ఖచ్చితంగా తలెత్తుతాయని, లాభాపేక్ష వల్ల సిండికేట్లు కూడా తయారవుతాయని, కాబట్టి మద్యం వ్యాపారాన్ని ప్రభుత్వం నిర్వహించటమే సమస్యకు పరిష్కారమని లోక్‌సత్తా తొలినుంచి చెబుతోందని, కానీ మద్యం వ్యాపారంలో పలువురు సాంప్రదాయ రాజకీయ (సా.రా) పార్టీల నేతలకు వాటా ఉండబట్టే ప్రభుత్వం మద్యం వ్యాపారాన్ని ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో పెడుతోందని అన్నారు. అలాంటి రాజకీయ ఆశ్రితపక్షపాత ధోరణి లేకపోతే

మద్యం వ్యాపారాన్ని ప్రభుత్వమే నిర్వహించటానికి ఏమిటి ఇబ్బంది అని ప్రశ్నించారు.

మద్యవిమోచన ప్రచారం కోసం కోట్లు ఖర్చుచేసినట్టు చెబుతున్నారని, ఓట్లు తెచ్చే ప్రభుత్వ పథకాల గురించి విపరీతంగా ఊదరగొట్టే ప్రచారమే తప్ప మద్యనియంత్రణ గురించి కాస్త ప్రచారం కూడా చూసిన గుర్తు రాష్ట్ర ప్రజలెవ్వరికీ లేదని శ్రీనివాసరావు అన్నారు. ఈ ఏడాది పంచాయతీ నుంచి పార్లమెంటు వరకూ ఎన్నికలు జరగనున్నాయని, ఓట్ల కోసం యువతకి మద్యం అలవాటు చేసి తాగబోయించేందుకు సా.రా పార్టీలు వెనకాడవని, అందువల్ల బెల్టుషాపులు ఈ సంవత్సరం మరింత పెచ్చరిల్లుతాయని అన్నారు. ఇప్పటికైనా మద్యం విధానాన్ని సవరించి ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు.

సీపీఐ ప్రతినిధి కె. రామకృష్ణ మాట్లాడుతూ... మద్యం విధానంపై రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలు గత ఏడాది నుంచి పలు ఆచరణాత్మక సూచనల్ని చెబుతున్నా ప్రభుత్వం పరిగణలోకి తీసుకోవటంలేదని, రహస్యంగా 2013-14 మద్యం విధానం రెన్యూవల్ జీవోల్ని విడుదల చేశారన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో మద్యం వ్యాపారం నడుస్తున్న తమిళనాడు వంటి రాష్ట్రాలలోని నమూనాపై కనీసం అధ్యయనం చేసే ప్రయత్నం లేదన్నారు. ప్రజాకంటకంకాని ప్రత్యామ్నాయ మద్యం విధానం ప్రవేశపెట్టేలా ప్రభుత్వం మీద ఒత్తిడి తేవాలని, ఎన్నికల సంవత్సరం కావటంతో ప్రభుత్వం కొంతయినా తలగ్గి మార్పులు చేసే అవకాశముంటుందని అన్నారు.

సీపీఎం ప్రతినిధి టి. సాగర్ ప్రసంగిస్తూ... బెల్టుషాపుల్ని పూర్తిగా ఎత్తివేయటంతోపాటు మద్యం ద్వారా వచ్చే ఆదాయంలో 15శాతం మద్యవ్యతిరేక ప్రచారానికి ఖర్చు చేయాలని, అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలతో కలిసి మద్యనియంత్రణ కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని అన్నారు.

కాంగ్రెస్ నేత ఎన్. తులసిరెడ్డి మాట్లాడుతూ... గాంధేయవాద పార్టీగా మద్యనిషేధానికి కాంగ్రెస్ పార్టీ సూత్రప్రాయంగా కట్టుబడివుందని, అయితే అది ఆచరణసాధ్యం కాదు కాబట్టి, దానివల్ల అసాంఘికశక్తులు తలెత్తుతాయని ఆచరణలో తేలింది కాబట్టి కొంత నియంత్రణతో మద్యాన్ని కొనసాగిస్తున్నామన్నారు. అయితే బెల్టుషాపుల నియంత్రణలో తాము విఫలమయ్యామని ఆయన పరోక్షంగా అంగీకరించారు. బెల్టుషాపులు తెలుగుదేశం హయాం నుంచి ఉన్నాయని, వాటిని తొలగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, ఇప్పటికి 12,373 బెల్టుదుకాణాలను తొలగించినా ఇంకా వేల సంఖ్యలో ఉండి ఉండవచ్చని అన్నారు. బెల్టుషాపుల తొలగింపునకు ఈ ఏడాది మరింత ఉధృతంగా అందుకు కృషి చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ప్రభుత్వమే మద్యం వ్యాపారాన్ని నిర్వహిస్తే బెల్టు దుకాణాలు లేకుండా చేయవచ్చని, అలా చేయటానికి ఎందుకు ముందుకు రావటం లేదని లేవనెత్తిన ప్రశ్నకు మాత్రం ఆయన సూటిగా సమాధానం ఇవ్వలేదు. 2012లో ప్రకటించిన లాటరీ మద్యం విధానం 2014 దాకా కొనసాగుతుందని, అందులో భాగంగానే తాజా మద్యం లైసెన్స్‌ల రెన్యూవల్‌ని భావించాలని, ప్రభుత్వమే నిర్వహించే ప్రతిపాదన గురించి వచ్చే ఏడాది ఆలోచించవచ్చని చెప్పారు.

ఆర్ఎస్‌పీ నేత జానకి రాం మాట్లాడుతూ... లోక్‌సత్తా ప్రవేశపెట్టిన అన్ని డిమాండ్లకూ తమ మద్దతును ప్రకటిస్తున్నామని తెలిపారు.

ప్రభుత్వ విధానం వల్లే పేదకుటుంబాలలో మద్యం అలవాటు పెరిగిందని, మద్యం విధానం మార్చటమే అసలైన సంక్షేమమని వెల్ఫేర్ పార్టీ నేత సాదిక్ అన్నారు.

మద్యం వినియోగం ఇంత వేగంగా పెరిగిన సమాజం బాగుపడిన దాఖలాలు లేవని, ప్రభుత్వం తన మద్యం విధానాన్ని వెనక్కి తీసుకోవాలని ఫార్వర్డ్ బ్లాక్ ప్రతినిధి నరేంద్ర డిమాండ్ చేశారు.

2007 నుంచి మద్యం సమస్యపై లోక్‌సత్తా చేసిన వివిధ యాత్రలలో, ప్రచార కార్యక్రమాలలో చూసిన గాథలు హృదయవిదారకమైనవని, వాటికి అక్షరరూపం ఇవ్వటం కూడా కష్టమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డి. లక్ష్మి, మహిళాసత్తా రాష్ట్ర అధ్యక్షురాలు ఎన్.సరోజాదేవి సోదాహరణంగా వివరించారు. పలు అత్యాచారాలకు, రోడ్డు ప్రమాదాలకు మద్యం వినియోగమే కారణమన్నారు. ఇది నైతిక సమస్యకాదని, సామాజిక సమస్యని, పేదప్రజల పట్ల ప్రభుత్వానికి ఏమాత్రం బాధ్యత ఉన్నా మద్యం విధానాన్ని సమూలంగా మార్చాలని అన్నారు.

లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వి.వి.ఎస్ వర్మ సమావేశంలో పాల్గొన్నారు. ■

# బెల్ట్ షాపులను ప్రోత్సహించేదిగా ప్రభుత్వ మద్యం విధానం (2013)

★ గత ఏడాది లాటరీ ద్వారా ఇచ్చిన మద్యం దుకాణాల లైసెన్సులనే జులై 1, 2013 నుంచి మరో ఏడాది పాటు యధావిధిగా రెన్యూవల్

★ జూన్ 30, 2014 వరకు ఉండే ఆబ్కారీ సంవత్సరంలో ప్రభుత్వ ఆదాయలక్ష్యం రూ.22,000 – 24,000 కోట్లు. గత ఏడాది కంటే ఇది కనీసం రూ.4,000 కోట్లు ఎక్కువ. 2011 జనాభా లెక్కల ప్రకారం ఆయా లైసెన్సు ఫీజులలో రానున్న మార్పుల కారణంగా ఈ ఏడాది లైసెన్సు ఫీజుల రూపంలో కూడా గత ఏడాది కంటే సుమారు రూ.600 కోట్లు ఎక్కువగా రానుంది.

★ మొత్తం మద్యం దుకాణాలు 6,596లో గత ఏడాది ఎవరూ ముందుకు రాకపోవటంతో మిగిలిపోయిన 617 దుకాణాలు కూడా ఈ సంవత్సరం మద్యం వ్యాపారులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. గతంలో విధించిన లైసెన్సు ఫీజు మారని చోట ఎక్కడైనా తమ ఇష్టానుసారంగా వ్యాపారులు మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చు.

★ అసలు మద్యం దుకాణాలు లేని మండలాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. తర్వాత మద్యం అమ్మకాలు లైసెన్సు ఫీజుకి ఆరురెట్లుకి మించి అమ్మకాలు జరిగిన ప్రాంతాలపై దృష్టి పెట్టాలి

★ మద్యం ప్రియులు ఇక నుంచి దర్జాగా బార్‌లలో తాగినట్టే రిటైల్ షాపులలోనే మద్యం సేవించేలా పర్మిట్ రూంలపై ఉన్న ఆంక్షలు పూర్తిగా తొలగింపు. పర్మిట్ రూంల విస్తీర్ణం కేవలం 15 చదరపు మీటర్లకు మించకూడదనే నిబంధనను తొలగించి దీన్ని 50 చదరపు మీటర్లకు పెంపు. పర్మిట్ రూం కోసం లైసెన్సు ఫీజుకి అదనంగా రూ.2లక్షలు చెల్లిస్తే చాలు

★ లైసెన్సు ఫీజుకి మించి ఆరు రెట్లు ఎక్కువ అమ్మకాలు జరిగిన తర్వాత విధించే అదనపు ప్రివిలేజ్ ఫీజు (టర్నోవర్‌పై 15శాతం) పరిమితి ఈసారి ఏడు రెట్లుకి పెంపు. బార్‌ల మీద కూడా ఈ పరిమితిని ముమ్ముందు ఐదు నుంచి ఆరు రెట్లుకు పెంచే అవకాశం

★ మద్యం విక్రయాలపై ప్రస్తుతం 21శాతం చెల్లిస్తున్న మార్జిన్‌ని 27శాతం పెంచాలని మద్యం వ్యాపారులు చేస్తున్న విజ్ఞప్తిపై కూడా ఒకట్రెండు రోజులలో ఉత్తర్వులు జారీ చేసే అవకాశం

★ రాజకీయ పార్టీలు, వివిధ స్వచ్ఛంద సంస్థల నుంచి తీవ్ర విమర్శల నేపథ్యంలో మద్యపానం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలలో విస్తృత ప్రచారం కల్పిస్తామనే హామీ. ప్రతి జిల్లా కేంద్రంలో డీ అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని వైద్యారోగ్య శాఖకు సూచన

**కొత్త విధానంలో లైసెన్సు ఫీజు**

| జనాభా | ఫీజు |
|---|---|
| 10వేల వరకు | రూ.32.50 లక్షలు |
| 10వేల నుంచి 50వేల వరకు | 34 లక్షలు |
| 50వేల నుంచి 3లక్షల వరకు | 42 లక్షలు |
| 3లక్షల నుంచి 5లక్షల వరకు | 46 లక్షలు |
| 5లక్షల నుంచి 20లక్షల వరకు | 64 లక్షలు |
| 20లక్షలకు పైబడిన జనాభా ఉంటే | 1 కోటీ 4లక్షలు |

2013–14 ఆబ్కారీ విధానం గత లాటరీ విధానానికి కొనసాగింపే కాబట్టి దీని వల్ల బెల్టుషాపులు యధావిధిగా విస్తరిస్తూ కొనసాగుతాయి. అంటే బెల్టుషాపులను తొలగిస్తామని మే 5, 2013న ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ అసత్యం.

తాజా విధానం వల్ల ప్రభుత్వానికి రోజుకు రూ.60–70కోట్లు, గంటకు రూ.3–4 కోట్లు అధికారిక ఆదాయం లభించే అవకాశముంది కాబట్టి, ప్రజలు అధికారికంగా గంటకు రూ.5–6కోట్లు మద్యానికే ఖర్చు పెడుతున్నట్టు లెక్క. సంక్షేమ పథకాలకు ప్రభుత్వం గరిష్టంగా రూ. 20,000 కోట్లు లోపు ఖర్చుచేస్తుంటే, మద్యం ద్వారా ప్రజలు తమ జేబుల్లో నుంచి దాదాపు రూ.40,000–50,000కోట్లు ఖర్చు చేస్తున్నారు. వేలం విధానంలాగే, ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో నడిచే ఈ మద్యం లాటరీ విధానం కూడా పేదల్ని మూకమ్మడి దగా చేస్తూ పేదరికాన్ని శాశ్వతంగా కొనసాగించే విధానం.

ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ చట్టం (1968)లోని సెక్షన్లు 14, 42,43ఎ, 45, ప్రొహిబిషన్ చట్టంలోని 7ఎ, ఐపీసీ సెక్షన్లు




481-89 అన్నీ కఠినంగా కల్తీ, అక్రమమద్యందారులపై చర్యలకు ఏర్పాట్లు ఉన్నా, ప్రభుత్వానికి రాజకీయ సంకల్పం లేకపోవటం, సామాన్యుల రక్తం పీల్చి మద్యం ద్వారా ఖజానాకు ఆదాయాన్ని సమకూర్చుకోవాలనుకోవటం, అవినీతికి, ముడుపులకు అలవాటు పడటం వల్ల పేదప్రజలు బలైపోతున్నారు.

ఢిల్లీ, తమిళనాడులలో నేరుగా ప్రభుత్వమే మద్యం వ్యాపారాన్ని నిర్వహిస్తూ విచ్చలవిడి మద్యం దుష్ఫలితాలకు అవకాశంలేకుండా చేస్తున్న విషయం తెలిసికూడా దానిని అనుసరించకుండా... 2004కు ముందు అప్పటి ప్రభుత్వం అనుసరించిన లైసెన్సు, లాటరీ పద్ధతినే 2012లో తెచ్చిన ప్రభుత్వం ఇప్పుడు 2013లో కూడా ఆ పాత సారానే కొత్త విధానంగా కొనసాగించే ప్రయత్నం చేస్తోంది.

ప్రభుత్వమే మద్యం రిటైల్ వ్యాపారాన్ని నిర్వహించాలి, ఈ దిగువ చర్యలు చేపట్టాలి ...

1) మద్యం వ్యాపారం ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో ఉంటే లాభాపేక్ష ధోరణితో సిండికేట్లు ఏర్పడతాయి కాబట్టి, బెల్టుషాపులు కొనసాగుతాయి కాబట్టి మద్యం రిటైల్ వ్యాపారాన్ని ప్రభుత్వమే చేపట్టి, పరిమితంగా, పరిమిత వేళల్లో, పరిమిత రోజులలో నిర్వహించాలి. కాబట్టి ఈ అంశంపై ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకోవాలి.

2) మద్యాన్ని ఆదాయమార్గం చేసుకునే పద్ధతికి స్వస్తిచెప్పి అమ్మకాలకు టార్గెట్లు నిలుపుచేయాలి.

3) మద్యం ద్వారా వచ్చే ఆదాయం కంటే ఆరోగ్యపరమైన నష్టాలు ఎక్కువకాబట్టి, మద్యం విధానాల్ని పర్యవేక్షించే అధికారాన్ని రాష్ట్రాలు తమ ఆరోగ్య, శిశుసంక్షేమ శాఖలకు ఇవ్వాలని, ఫలితంగా తగ్గే మద్యం ఆదాయాన్ని కేంద్ర ప్రభుత్వం భర్తీ చేసేలా కృషి చేస్తామని కేంద్ర ఆరోగ్య శాఖ గతంలో చేసిన ప్రతిపాదనను మద్యనియంత్రణకు ఒక అవకాశంగా తీసుకుని అమలుకు కృషి చేయాలి.

4) బెల్టుషాపుల మూసివేతకు నోటిమాటగాకాకుండా అధికారికంగా, లిఖితపూర్వకంగా ఎక్సైజ్, పోలీసు, రెవిన్యూ సిబ్బందికి ఆదేశాలివ్వాలి.

5) బెల్టుషాపుల తొలగింపు, మద్య విమోచన గురించి సత్ఫలితాలనిచ్చే ప్రచార కార్యక్రమాలను చేపట్టాలి. ■

# జేపీ సమక్షంలో లోక్‌సత్తాలో చేరిన శ్రీమతి కాంతికన్నన్

ప్రముఖ హైదరాబాదీ, రాజధానిలో పాదచారుల హక్కుల కోసం కొన్నేళ్లుగా పోరాడుతున్న సామాజిక కార్యకర్త, రైట్ టూ వాక్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు శ్రీమతి కాంతిమతి కన్నన్ పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో జయప్రకాశ్ నారాయణ్ చేతుల మీదగా లోక్‌సత్తా సభ్యత్వం తీసుకున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావుతో కలిసి జేపీ ఆమెను సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.




ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ... రాజకీయాలంటే ఎల్.కె అద్వానీ, సోనియా గాంధీ, మన్మోహన్ సింగ్, రాహుల్ గాంధీ, వైఎస్ రాజశేఖరరెడ్డి, చంద్రబాబు నాయుడు కాదని, రాజకీయాలంటే నా జీవితం, నా చుట్టూ ఉన్న రోడ్లు, ఫుట్‌పాత్‌లు, నీళ్లు, ఆసుపత్రులు, ట్రాఫిక్, పిల్లల చదువులు అని గుర్తించి పనిచేసిన కాంతిమతి కన్నన్ లోక్‌సత్తా పార్టీలో చేరటం సంతోషకరమని అన్నారు. తనకు అన్ని వనరులూ, అవకాశాలూ ఉన్నా సమాజంలో అంతర్భాగమైన తాను మెరుగైన సమాజం కోసం కృషి చేయాలనే భావనతో, ఎంతమంది నిరుత్సాహపరిచినా ఒంటరిగా పాదచారుల ప్రయోజనాల కోసం కాంతిమతి కన్నన్ చాలా కృషి చేశారని, పౌరురాలుగా తాను చేసిన రాజకీయకృషిని మరింత సమగ్రంగా కొనసాగించేందుకు లోక్‌సత్తా పార్టీని వేదికగా చేసుకున్నారని పేర్కొన్నారు. ఇలాంటివాళ్లు రాజకీయాలలోకి రావటం మనదేశానికి ముస్ముందు మంచి భవిష్యత్తుందనటానికి సంకేతమన్నారు.

ఇతర రాజకీయ పార్టీలకు భిన్నంగా లోక్‌సత్తా పార్టీకి సమగ్ర తాత్విక దృక్పథముందని జేపీ వివరించారు. ఎంతో భిన్నత్వం కలిగిన సంక్లిష్ట సమాజంలో పరస్పర విరుద్ధ ప్రయోజనాలను సైతం సమన్వయం చేసే సమ్యక్ దృక్పథం, హేతుబద్ధ వైఖరితో సమస్యలకు పరిష్కారాలను అందించటం, పరిష్కారంలో భాగమవటం, రాజకీయాలలో నిజాయతీని అత్యున్నత అర్హతగా కాకుండా కనీస లక్షణంగా భావిస్తూ చెప్పిందే చేసి చూపేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించటం– ఈ మూడూ లోక్‌సత్తాకు మాత్రమే ఉన్న విశిష్టతలన్నారు.

శ్రీమతి కాంతిమతి మాట్లాడుతూ... తాను ఏ నియోజకవర్గంలో పనిచేసినా పేదల ముఖాల మీద చిరునవ్వును చూసేందుకు వారి అభివృద్ధి కోసమే కృషి చేస్తానన్నారు.

ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కటారి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు బండారు రామ్మోహన్‌రావు పాల్గొన్నారు. ■

## శ్రీమతి కాంతిమతి కన్నన్ గురించి...

**హైదరాబాద్‌లో పుట్టిపెరిగిన కాంతిమతి, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎం.బి.ఎ పట్టా తీసుకున్నారు. విద్యారంగంలో నిపుణురాలిగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించేవారు. తర్వాత రైట్ టూ వాక్ ఫౌండేషన్‌ని స్థాపించి హైదరాబాద్‌లో పాదచారుల హక్కుల సాధన కోసం పూర్తిసమయం కేటాయించారు. రాజధానిలో ఈ తరహా కృషి మొదలవటం అదే మొదటిసారి. ఆమె కృషిని ఆసియా అభివృద్ధి బ్యాంకు, ఐక్యరాజ్యసమితి పర్యావరణ రక్షణ సంస్థ వంటివి గుర్తించి ప్రశంసించాయి.**

### లోక్‌సత్తా పార్టీ శిక్షణ...

# పదును పెట్టాం పని చేయండి



ఆప్కాబ్ వర్క్‌షాప్‌లో వర్కింగ్ కమిటీ సభ్యులు

**2013**లో రాష్ట్ర వ్యాప్తంగా లోక్‌సత్తా పార్టీ సంస్థాగత ఎన్నికల్లో ఎన్నికైన నూతన కార్యవర్గాలకి మే, జూన్ మాసాలలో శిక్షణ ఇచ్చింది. శిక్షణ ఒకరకంగా మెదడుకు పదునుపెట్టడం లాంటిది. పదును పెట్టిన మెదడు కేవలం ఆలోచనలకే పరిమితం కాకుండా ఆచరణ అనే కార్యరంగంలోకి దూకాలని ఈ శిక్షణ స్పష్టం చేసింది.

ఎన్నికైన జిల్లాల కార్యవర్గాలకి మే నెలలో హైదరాబాద్ కొత్తపేటలోని ప్రజాస్వామ్య శిక్షణ కేంద్రంలో మూడు విడతలుగా శిక్షణ ఏర్పాటు చేసింది. మొదటి విడత మే 18, 19 తేదీల్లో శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్టణం, తూర్పుగోదావరి జిల్లాలు, మే 21, 22 తేదీల్లో గ్రేటర్ హైదరాబాద్, ఖమ్మం, కర్నూలు, అనంతపురం జిల్లాలు, మే 25, 26 తేదీల్లో కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల కార్యవర్గాలకి శిక్షణ జరిగింది.

రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులకు జూన్ 25, 26, 27 తేదీల్లో రాజేంద్రనగర్‌లోని "ఆప్కాబ్" శిక్షణ కేంద్రంలో మూడురోజుల వర్క్‌షాప్ జరిగింది. 2013-14లో వచ్చే అన్ని ఎన్నికలలో పార్టీ వ్యూహం, కార్యాచరణకు సంబంధించిన అంశాలలో అవగాహన కల్పించారు. పార్టీ సభ్యులను క్రియాశీల కార్యకర్తలుగా మార్చుకోవడం, క్రియాశీల కార్యకర్తలనీ నాయకులుగా తీర్చిదిద్దుకోవడం అనే అంశంలో శిక్షణ జరిగింది. సమకాలీన రాజకీయ ఆర్థిక, సామాజిక రంగాల విశ్లేషణ కోసం రాష్ట్రంలో పేరున్న జర్నలిస్టులు, సామాజిక విశ్లేషకులతో ఈ మూడురోజుల వర్క్‌షాప్ లోతైన అవగాహనని పెంచింది. మొదటిరోజు హెచ్ఎంటివి, హన్స్‌ఇండియా సంపాదకులు కె.రామచంద్రమూర్తి ప్రస్తుత రాజకీయ పరిస్థితి, రాజకీయ పార్టీలు అనే అంశంపై ప్రసంగించారు. 2014 ఎన్నికలు మన లక్ష్యం, సాధించే మార్గాలు అనే అంశంపై లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.వి.వి.యస్.వర్మ మార్గదర్శనం చేశారు. లోక్‌సత్తా పార్టీ విధానం వ్యవసాయాన్ని ఎలా లాభసాటి చేస్తుంది అనే అంశంపై కోశాధికారి డా॥ పి.భాస్కర్‌రావు, స్థానిక ప్రభుత్వాల ఎన్నికలలో మన వ్యూహాలు-ఎత్తుగడలు అనే అంశంపై రాష్ట్ర అధ్యక్షులు కటారి శ్రీనివాసరావు, ప్రాథమిక విద్య, వైద్యం అందరికి అందించటం ఎలా? అనే అంశంపై రాష్ట్ర ఉపాధ్యక్షులు బండారు రామ్మోహనరావు అవగాహన కల్పించారు.

రెండవరోజు కార్యక్రమంలో యువసత్తా, మహిళాసత్తా కార్యక్రమాల గురించి రాష్ట్ర యువసత్తా అధ్యక్షులు పి. శివాజీ, మహిళాసత్తా అధ్యక్షులు సరోజాదేవి అవగాహన కల్పించారు. కొత్త తరహా రాజకీయాలను మీడియాలో ప్రచారం చేయడం ఎలా? అనే అంశంపై విశాలాంధ్ర ఛీఫ్ ఎడిటర్ కె.శ్రీనివాస్‌రెడ్డి ప్రసంగించారు. వివిధ రాజకీయ పార్టీలు, జనాకర్షక పథకాలు, పర్యవసాలు అనే అంశంపై ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు డి. సోమసుందర్ ప్రసంగించారు. కఠిన మద్యనియంత్రణపై లోక్‌సత్తా విధానాన్ని రాష్ట్ర కార్యదర్శి బీశెట్టి బాబ్జీ తెలిపారు. నూతన రాజకీయ సంస్కృతి-అవశ్యకత అనే అంశంపై విధాన మండలి సభ్యులు డా॥ కె. నాగేశ్వర్ ప్రసంగించారు. అవినీతిని నిరోధించగల సంస్థాగత ఏర్పాట్ల గురించి లోక్‌సత్తా పార్టీ శిక్షణ విభాగం బాధ్యులు పద్మ భూపతిరాజు అవగాహన కల్పించారు.

మూడవరోజు శిక్షణలో రాష్ట్రంలో రావాణాకాష్టంలా రగులుతున్న విద్యుత్ సంక్షోభం, తెలంగాణ సమస్య మీద రిసోర్స్‌పర్సన్ కార్తీక్‌చంద్ర అవగాహన కల్పించారు. సామాజిక వర్గాలు-ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ పరిస్థితి అనే అంశంపై రాజకీయ విశ్లేషకులు డా॥ కె. చిన్నయ్యసూరి ప్రసంగించారు. రాజకీయ పార్టీలు-ఓటర్ల ప్రవర్తన అనే అంశంపై ఎన్నికల విశ్లేషకులు డి. అశోక్ ప్రసంగించారు.

*రిపోర్టు :* **బండారు రామ్మోహనరావు**




# పంచాయతీలలో సిటిజన్స్ ఛార్టర్లు అమలుచేయాలి

## వినుకొండలో సురాజ్యం

పట్టణంలోని ఫర్టిలైజర్స్ కళ్యాణ మండపంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పలు తీర్మానాలు చేశారు. గ్రామంలో మౌలిక వసతులపై అవగాహన కల్గి సమకూర్చగల సమర్థుడిని స్థానిక సంస్థల్లో గెలిపించుకోవాలన్నారు. ప్రభుత్వ సొమ్ముతో నడుస్తున్న ప్రభుత్వ పాఠశాలలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, పశువైద్య కేంద్రాలు, అంగన్‌వాడీలు, రేషన్‌షాపులు మొదలగు సంస్థలకు ప్రజలకు సక్రమంగా సేవలు అందించే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. పంచాయితీలలో సుపరిపాలన జరగాలంటే గ్రామ సభల్లో ప్రజలు అభిప్రాయాలను రికార్డు చేసి పంచాయితీ సమావేశంలో చర్చించిన అనంతరం నిర్ణయాలు చేసే సాంప్రదాయాన్ని ఆచరణలోకి తీసుకురావాలన్నారు. పంచాయితీ పాలనలో సమాచార హక్కు చట్టాన్ని పూర్తిగా అమలు చేయాలని, ఆదాయ వ్యయాలు, సిబ్బంది జీతభత్యాలు విధులు బాధ్యతల పట్టిక, పంచాయితీ అందించే సేవలకు సంబంధించిన పట్టికను ప్రజలందరికి తెలిసేవిధంగా ఏర్పాటు చేయాలన్నారు. డబ్బు, కులం, మతం, మద్యం ప్రలోభాలకు లొంగి అసమర్థత నాయకత్వాన్ని ఎన్నుకోకుండా జాగ్రత్తపడాలన్నారు. వీటితోపాటు పంచాయతీకి సంబంధించిన పలు విషయాలను చర్చించి ఎజెండాలో చేర్చారు. ఈ కార్యక్రమానికి పి.నాగచరణ్ తేజ అధ్యక్షత వహించగా, జుజ్జూరి ఐరామమూర్తి, పిజె లూకా, చుండూరి వెంకటేశ్వర్లు, తుపాకుల కొండలరెడ్డి, పెండ్యాల శ్రీనివాసరావు, నాగచారి, సిహెచ్ రమేష్, కృష్ణ, లోక్‌సత్తా నాయకులతో పాటు సుమారు 100కి పైగా యువతి, యువకులు పాల్గొన్నారు.

# మెరుగైన పౌరవసతులు, సేవలకోసం ఉద్యమించాలి

## తణుకులో సురాజ్యం

మెరుగైన పౌరవసతులు, సేవలే ప్రధానాంశంగా వచ్చే స్థానిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులపై ఒత్తిడి తెచ్చే విధంగా ప్రజలను చైతన్యవంతులను చేయాలని సురాజ్య ఉద్యమ కమిటీ రాష్ట్ర సారధ్య సంఘం సభ్యులు డివివియస్ వర్మ కోరారు. స్థానిక సురాజ్య భవన్‌లో సురాజ్య ఉద్యమ కమిటీ తణుకుశాఖ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ మునిసిపల్, పంచాయితీల్లో ప్రజలకు మెరుగైన సేవలందించేలా కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థలు అందించే సేవలుపైన ప్రజలను చైతన్య వంతులను చేయడంలో సురాజ్య ఉద్యమ కమిటీలు సమర్థవంతంగా పని చేయాలన్నారు. సురాజ్య ఉద్యమ కమిటీ పట్టణ శాఖ అధ్యక్షుడు డా॥ టి. రామబ్రహ్మం సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో రాజకీయ పార్టీలకతీతంగా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సురాజ్య ఉద్యమం ద్వారా ప్రజలను చైతన్యవంతం చేయాలన్నారు. కన్వీనర్ బి. రమేష్ చంద్రబాబు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, అవినీతిరహిత పాలన తదితర అంశాలపై ప్రజలను భాగస్వామ్యం చేయడానికి సురాజ్య ఉద్యమ కమిటీలను వార్డు స్థాయిలలో ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు ఆకుల వెంకటేశ్వరరావు, నందిగం సుధాకర్, లోక్‌సత్తా నాయకులు డా॥ వి.వి.రామదాసు, సిపిఐ తణుకు ఏరియా కార్యదర్శి కోనాల భీమారావు, తెదేపా నాయకులు టి. మారుతీరావు, భాజపా నాయకుడు మల్లినరాధాకృష్ణ, బీఎస్‌పీ నాయకుడు పొట్ల సురేష్, లోక్‌సత్తా మనోరమ పాల్గొన్నారు.

# ఉపాధి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలి

## దేవనకొండ

మండల పరిధిలోని నేలతలమర్రి గ్రామ పరిధిలో ఉపాధి పనుల్లో జరుగుతున్న అవినీతి అక్రమార్కులపై విచారణ చేపట్టి అందుకు బాధ్యులైన వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. ఓంకారయ్య తెలిపారు. శనివారం వారు ఉపాధిలో జరుగుతున్న అక్రమాలపై విచారణ చేపట్టాలని డిప్యూటీ తహశీల్దార్ రంగన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ ఉపాధి పనుల గురించి అడిగేందుకు వెళ్లితే లోక్‌సత్తా నాయకులపై ఎస్‌సి, ఎస్‌టి కేసులు నమోదు చేయడం దారుణమన్నారు.

ఉపాధి హామీలో లక్షల్లో అవినీతి జరిగిందని, అందుచేత ఎసిబి వారిచే విచారణ చేపట్టాలన్నారు. లోక్‌సత్తా ఆధ్వర్యంలో కలెక్టర్, లోకాయుక్తల దృష్టికి సమస్యను తీసుకెళ్లడం జరుగుతుందున్నారు. కార్యక్రమంలో లోక్‌సత్తా జిల్లా ఉపాధ్యక్షులు ఆనందాచారి, తాలుకా అధ్యక్షులు నాగేంద్ర, నాయకులు రామదాసు, మారుతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# లోక్‌సత్తా సిద్ధాంతాలకు ఆదరణ పెరుగుతోంది



లోక్‌సత్తా సిద్ధాంతాలకు ప్రజల్లో ఆదరణ పెరుగుతోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కటారి శ్రీనివాసరావు అన్నారు. లోక్‌సత్తా జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఆధ్వర్యంలో అమీర్‌పేటలోని సారథీ స్టూడియో వద్ద యువసత్తా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కటారి శ్రీనివాసరావు మాట్లాడుతూ నాయకులను సభ్యుల ద్వారా ఎన్నుకునే అవకాశాన్ని కల్పించిన ఘనత లోక్‌సత్తాకే దక్కుతుందన్నారు. ప్రజా సమస్యలను విస్మరించి, పార్టీలను భ్రష్టుపట్టించే రాజకీయ నేతలకు లోక్‌సత్తా ప్రతినిధులు కనువిప్పు కల్పించాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ, వారిలో విశ్వాసాన్ని పెంచాలని సూచించారు. పార్టీ జూబ్లీహిల్స్, నియోజకవర్గం అధ్యక్షులు బి.సాంబిరెడ్డి, యువసత్తా నాయకులు నరేంద్ర, సందీప్, గావేష్, లోక్‌సత్తా నాయకులు అన్నపూర్ణ. పోచిరెడ్డి, సుబ్రమణ్యం, రాజు, శ్రీధర్, సుధాశేఖర్ పాల్గొన్నారు. పలువురు యువకులకు యువసత్తా సభ్యత్వాన్ని అందజేశారు.

### లోక్‌సత్తా ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు

**వెంగళరావునగర్ :** అవినీతి లేని సమాజాన్ని నిర్మించడానికే లోక్‌సత్తా పార్టీ ఈ రాష్ట్రంలో ఆవిర్భవించిందని ఆ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ అధ్యక్షురాలు హైమా చెప్పారు. బోరబండ డివిజన్‌లో లోక్‌సత్తా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లోక్‌సత్తా పార్టీ జూబ్లీహిల్స్ నియోజకవర్గ అధ్యక్షులు సాంబిరెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్

### సంఘటితంగా పోరాడితేనే సమస్యల పరిష్కారం

**యూసుఫ్‌గూడ :** సంఘటితంగా పోరాడినప్పుడే సమస్యలు పరిష్కరించబడతాయని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర నాయకుడు పెద్దన్న అన్నారు. రహ్మత్‌నగర్ డివిజన్‌లో సమాజసేవ – రాజకీయపాత్రపై సదస్సును నిర్వహించడంతోపాటు సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ అధ్యక్షుడు సాంబిరెడ్డి మాట్లాడుతూ సమాజంలో పెరుగుతున్న అవినీతిపై కలసికట్టుగా పోరాడాలన్నారు. పార్టీలో చేరిన వారికి కండువాలను కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు, రాజు, అన్నపూర్ణ, సుధాశేఖర్, వి.వి.రాజు, గణేష్, సందీప్, మహేశ్వర్, రాజు, బాలసుబ్రమణ్యం, శ్రీధర్ పాల్గొన్నారు.



### బాలికా శిశు సంరక్షణ పథకాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

**అమీర్‌పేట :** బాలికా శిశు సంరక్షణ పథకంలోని లోపాలను సవరించి సమర్థంగా అమలు జరపాలని కోరుతూ జూబ్లీహిల్స్ నియోజకవర్గం లోక్‌సత్తా పార్టీ నేతలు మహిళ శిశు సంక్షేమ కార్యాలయంలోని ఏడీఈ విశాలాక్షిని కలిసి వినతిపత్రం అందజేశారు. లోక్‌సత్తా జూబ్లీహిల్స్ నియోజకవర్గం అధ్యక్షులు బి.సాంబిరెడ్డి ఆధ్వర్యంలో నేతలు అన్నపూర్ణ, సుధాశేఖర్ రాజు, సుబ్రమణ్యం, మహేశ్వర్, సందీప్, రాజేందర్ ఏడీఈని కలిసి ఈ మేరకు విన్నవించారు.

# నియోజకవర్గాల కార్యకర్తల సమావేశం

## కూకట్‌పల్లి

లోక్‌సత్తా పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ కార్యాలయంలోకూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ నియోజకవర్గాలలో డివిజన్ల వారీగా పటిష్టమైన నిర్మాణం, కార్యకర్తల బాధ్యతలు గురించి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి లోక్‌సత్తా గ్రేటర్ బాధ్యులు యన్. రవీందర్, డి.లక్ష్మి, దోసపాటి రాము మరియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రవిమారుత్‌గారు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సంస్థాగత విషయాలపై చర్చ జరిపారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్.శ్రీనివాసన్, అధ్యక్షులు కొమ్ము సత్తయ్య, శేరిలింగంపల్లి



నియోజకవర్గ అధ్యక్షులు వెలగా శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అధ్యక్షులు బాషాగారు, మూడు నియోజకవర్గాల కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్థానికులకే ఉద్యోగాలివ్వాలని సంతకాల సేకరణ

## గుంతకల్లు

గుంతకల్లు రైల్వే డివిజన్‌లో ఖాళీగా ఉన్న గ్రూప్-డి పోస్టులను స్థానిక నిరుద్యోగులతో భర్తీ చేయాలని లోక్‌సత్తా పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. రైల్వే జంక్షన్‌రోడ్డు, పొట్టి శ్రీరాములు కూడలి వద్ద సంతకాల సేకరణ చేపట్టారు. పలువురు నిరుద్యోగులు బ్యానర్లపైన సంతకాలు చేశారు. తాము వాటిని అధికారులకు అందజేస్తామని లోక్‌సత్తా నియోజకవర్గ కన్వీనర్ రామ్మోహన్‌రావు అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# యువతకు రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలి

## హయత్‌నగర్

దేశంలో 70 శాతం యువత ఉన్నప్పటికీ వారికి రాజకీయ ప్రాధాన్యం దక్కడంలేదని హయత్‌నగర్ మండల సురాజ్య ఉద్యమ కన్వీనర్ నక్క సంజీవ్ కుమార్ అన్నారు. హయత్‌నగర్‌లో నిర్వహించిన యూత్ అసెంబ్లీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వారసత్వ రాజకీయాల్లో మాత్రమే కొంతమంది యువకులకు అవకాశాలు దక్కుతున్నాయన్నారు. దీంతో కింది స్థాయిలో జెండాలు మోసే యువకులకు అవకాశాలు రావడంలేదని అన్నారు. ఈ కార్యక్రమంలో యువకులు ప్రవీణ్‌కుమార్, మల్లేష్‌యాదవ్, సురేష్‌కుమార్, శ్రీకాంత్, రాము, ప్రకాష్‌తోపాటు వివిధ గ్రామాల నుంచి యువకులు పాల్గొన్నారు.

**నాయకత్వ లక్షణాలు :** యువత నాయకత్వ లక్షణాలను అలవరచుకుని మంచి రాజకీయాల కోసం ముందుకు రావాలని సురాజ్య ఉద్యమం హయత్‌నగర్ కమిటీ కన్వీనర్ నక్క సంజీవ్‌కుమార్ అన్నారు. "యువత-నాయకత్వ లక్షణాలు-సమస్యలపై పోరాటం" అనే అంశంపై హయత్‌నగర్‌లో ఆయా రాజకీయ పార్టీలకు చెందిన యువకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

# పంచాయతీలలో పోటీకి సన్నాహాలు

## పత్తికొండ




స్థానిక సంస్థల ఎన్నికలలో లోక్‌సత్తా పార్టీ పోటీకి నిలుస్తుందని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆనందాచారి పిలుపునిచ్చారు. స్థానిక కన్యకాపరమేశ్వరి కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి సమావేశం జరిగింది. నియోజకవర్గ ఇన్‌చార్జి నాగేంద్ర ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల వల్ల ప్రజల్లో నిరసన ఉందన్నారు. అలాగే గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అధికార పార్టీ నాయకులు అవినీతి అక్రమాలకు పాల్పడుతూ... లక్షలాది రూపాయలను కొల్లగొడుతున్నారని ఆరోపించారు. ఈ అవినీతిపై ఎసిబి చేత విచారణ చేయించాలని లోకాయుక్తాకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. .... ఎన్నికల్లో సర్పంచులుగా, వార్డు సభ్యులుగా, ఎంపిటీసీ, జడ్పిటీసీ స్థానాలకు లోక్‌సత్తా అభ్యర్థులు పోటీకి సిద్ధం కావాలని యువ నాయకత్వం అందుకు నడుంబిగించాలన్నారు.

# స్కూల్ వాహనాలను తనిఖీలు చేయాలి



తిరుపతి పరిసర ప్రాంతాల్లోని స్కూల్ విద్యార్థులను తీసుకెళ్లే వాహనాలను తనిఖీలు చేయాలని లోక్‌సత్తా పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లంకొండ సురేష్ కోరారు. ఈ మేరకు ఆర్టీవో ఎంఎస్ఎన్‌బీ. ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ స్కూల్ విద్యార్థులను తరలించే వాహనాలు కండిషన్‌లో లేవని, అలాంటి వాహనాలను తనిఖీ చేసి సీజ్ చేయాలని కోరారు. వాహనాల్లో సరైన సదుపాయాలు లేవని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఆర్టీఏ అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీవో స్పందిస్తూ ఇప్పటికే అనేకసార్లు స్కూల్ వాహనాలనపై దాడులు నిర్వహించి, అనేక బస్సులను సీజ్ చేసినట్టు తెలిపారు. ఇటీవల స్కూల్ వాహనాలు డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించినట్టు చెప్పారు. ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించిన వారిలో పార్టీ నాయకులు బాలసుబ్రమణ్యం, మునిచంద్ర, కిరణ్, మదనమోహన్, హేమాద్రి, ప్రసాద్ ఉన్నారు.

## తిరుపతి

# పంచాయతీ ఎన్నికలు-అభ్యర్థుల అర్హతలు, అనర్హతలు

## (రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన నిబంధనలు)

1. గ్రామపంచాయితీ సభ్యుని లేదా సర్పంచ్ పదవికి అభ్యర్థిగా మీరు పోటీ చేయదలచుకొన్నట్లయితే, ఈ దిగువ వివరించినట్లుగా మీరు కొన్ని అర్హతలను కలిగి ఉండాలి.

   (ఏ) గ్రామపంచాయితీ సభ్యుని లేదా సర్పంచ్ సీటుకు మీరు అభ్యర్థి అయినట్లయితే, మీరు ఆ గ్రామపంచాయితీ ఎన్నికల ఓటర్ల జాబితాలో నమోదయిన ఓటరుగా వుండాలి.

   (బి) మీరు 21 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు కలిగి ఉండరాదు. నామినేషన్ల పరిశీలన తేదీ నాటికి మీ వయస్సు లెక్కగట్టడమవుతుంది.

   (సి) షెడ్యూల్ తెగలకు చెందిన అభ్యర్థుల ద్వారా భర్తీ చేసేందుకు రిజర్వుచేసిన పదవికి మీరు అభ్యర్థిగా వున్నట్లయితే, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి షెడ్యూలు తెగలుగా ప్రకటించిన కులాలలో ఏదేని కులానికి మీరు చెంది వుండాలి. షెడ్యూలు తెగకు చెందిన అభ్యర్థి రిజర్వు చేయబడని స్థానం నుండి కూడా పోటీ చేయవచ్చును.

   (డి) షెడ్యూల్ కులాలకు లేదా వెనుకబడిన తరగతులకు రిజర్వుచేసిన పదవికి మీరు అభ్యర్థిగా వున్నట్లయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన, సందర్భాన్ని బట్టి, షెడ్యూల్ కులాలు లేదా వెనుకబడిన తరగతులుగా ప్రకటించిన ఏదేని కులానికి మీరు చెంది వుండాలి. షెడ్యూలు కులానికి లేక వెనుకబడిన తరగతులకు చెందిన అభ్యర్థి రిజర్వుచేయబడని స్థానం నుండి కూడా పోటీ చేయవచ్చును.

   (ఇ) మహిళలకు రిజర్వుచేసిన పదవికి పోటీ చేసేందుకు మీరు మహిళ అయి ఉండాలి. అయినప్పటికి, మహిళ అభ్యర్థి అదే క్యాటగిరిలో జనరల్ సీటుకు కూడా పోటీ చేయవచ్చును. అంతేకాకుండా రిజర్వుడు క్యాటగిరి (ఎస్.టి., ఎస్.సి., బి.సి.)కి చెందిన అభ్యర్థి రిజర్వు చేయనట్టి సీటు నుండి కూడా పోటీ చేయవచ్చును.

2. మీరు అభ్యర్థిగా వుండాలనుకున్నట్లయితే, నామినేషన్లు పరిశీలనకు నిర్ణయించిన తేదీనాటికి ఈ క్రింది అనర్హతలలో దేనిని మీరు కలిగి వుండకూడదు.

   (ఏ) నైతిక కర్తవ్యాపేక్షకు పాల్పడిన నేరానికిగాను క్రిమినల్ కోర్టు మీకు కారాగారశిక్షను విధించి వుండకూడదు. అట్టి శిక్ష ముగిసిన తేదీనుండి అయిదు సంవత్సరాల కాలంపాటు ఈ అనర్హత వుంటుంది.

   (బి) 1955, పౌరహక్కుల పరిరక్షణచట్టం క్రింద నేరానికిగాను మీకు కారాగారశిక్షను విధించి వుండకూడదు.

   (సి) 1994, ఆంధ్రప్రదేశ్ పంచాయితీరాజ్ చట్టంలోని సెక్షన్ 19ఎ, 19బి లేక 20ఎ లో పేర్కొన్న నేరానికి సంబంధించి మిమ్ములను దోషిగా నిర్ణయించి వుండకూడదు.

   (డి) మీరు అస్వస్థచిత్తాన్ని లేదా మూగతనాన్ని కలిగి వుండకూడదు.

   (ఇ) మీరు దివాలాదారు లేదా అప్పు చెల్లించనివారుగా న్యాయ నిర్ణయం చేయబడినవారై వుండరాదు.

   (ఎఫ్) గ్రామపంచాయితీ, మండల పరిషత్తు, జిల్లా పరిషత్తు లేక రాష్ట్ర లేక కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి ఏదేని పని లేక కాంట్రాక్టులో ఎలాంటి ఆసక్తిని కలిగి ఉండరాదు.

   (జి) గ్రామపంచాయితీ తరపున వేతన న్యాయ ప్రాక్టీషనర్‌గా లేక దానికి విరుద్ధంగా న్యాయ ప్రాక్టీషనర్‌గా మీరు నియమితులై వుండకూడదు.

   (హెచ్) రాష్ట్ర ప్రభుత్వం 25 శాతానికి తక్కువకాని షేరు కాపిటలు కలిగి ఉన్న ఏదేని కంపెనీ లేక

కార్పొరేషను (సహకార సంఘం కానట్టి)కు మేనేజరు లేక కార్యదర్శిగా నియమించబడరాదు.

(ఐ) గ్రామంలోని ఏదేని భాగంపై అధికారపరిధిలో 1973, క్రిమినల్ ప్రొసీజరు కోడ్ క్రింద మీరు గౌరవ మేజిస్ట్రేట్‌గా వుండకూడదు.

(జె) గ్రామపంచాయితీకి సంబంధించి గత ఆర్థిక సంవత్సరంతో సహ ఆ సంవత్సరం వరకు విశ్వాసబద్ధమయిన సామర్థ్యంతో, కాకుండా ఇతర సర్‌చార్జీ చేసిన పైకాలతో సహా ఏదేని బకాయిలను చెల్లించాల్సివున్నట్లయితే, వీటి విషయంలో బిల్లును లేదా నోటీసును తగువిధంగా అందజేసి, చెల్లింపుకోసం అందులో ఏదయినా సమయాన్ని నిర్దిష్టపరచివున్నచో అట్టి సమయం ముగిసి వుండి, సదరు బకాయిలను మీరు చెల్లించకుండా వుండకూడదు.

(కె) గ్రామసేవకుడుగా లేక కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వ లేక స్థానిక ప్రాధికారవర్గపు లేక ప్రభుత్వ నిధుల నుండి సహాయం పొందే ఏదేని సంస్థ ఉద్యోగిగా లేక అధికారిగా ఉండరాదు. రాష్ట్ర శాసనసభ లేక పార్లమెంటు చేసిన శాసనం క్రింద ఏర్పాటు చేయబడిన ఏదేని బాడీ (సంస్థ) ఆఫీసు బేరరుగా ఉండరాదు.

(ఎల్) రాష్ట్ర శాసనమండలి (స్టేట్ లెజిస్లేచరు) ఎన్నికల నిమిత్తం ప్రస్తుతం అమలులో ఉన్న ఏదేని శాసనం ద్వారా లేక దాని క్రింద మీరు అనర్హులుగా ఉండరాదు.

(ఎం) ఇద్దరికంటే ఎక్కువమంది పిల్లలను కలిగి వున్నందులకు చట్టంలోని 19(3) విభాగం క్రింద మిమ్ములను అనర్హులుగా చేసి వుండకూడదు.

# నామినేషన్లు

**1. <u>నామినేషన్ల స్వీకరణకు నిర్ణయించిన తేదీ, సమయం :-</u>**

నామినేషన్ల స్వీకరణకు నిర్ణయించిన తేదీ, సమయాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘం జారీచేసిన ఎన్నికల ప్రకటనలోను, ఎన్నికల అధికారి జారీచేసే ఎన్నికల నోటీసులోను కూడా తెలియజేయడమవుతుంది. సాధారణంగా నామినేషన్లు ప్రభుత్వ సెలవుదినముతో సహా ఎన్నికల నోటీసులో ప్రకటించిన అన్ని రోజులలో (ఉదయం 11 గంటలు, మధ్యాహ్నం 3 గంటల మధ్య) స్వీకరించడమవుతుంది.

**2. <u>నామినేషన్లను దాఖలు చేసే సమయంలో గమనించ వలసిన ముఖ్యాంశాలు :-</u>**

నామినేషన్ పత్రం నిర్ణీత నమూనా (3వ నమూనా)లో వుండాలి. నామినేషను ఫారం ప్రతిని **IIIవ అనుబంధం**లో జతపరచడమయింది. నామినేషన్ పత్రాలను దాఖలు చేసే సమయంలో మీరు ఈ క్రింది అంశాలను గమనించాలి.

(ఎ) మిమ్ములను ప్రతిపాదించే వ్యక్తి గ్రామపంచాయితీలో నమోదయిన ఓటరుగా వుండాలి.

(బి) సర్పంచు పదవికి మిమ్ములను ప్రతిపాదించే వ్యక్తి సంబంధిత గ్రామపంచాయితీలోని ఏదేని వార్డులో రిజిస్టరయిన ఓటరుగా వుండాలి.

(సి) ఒకే పదవికి విడిగా ఒక్కరికంటే ఎక్కువమంది ప్రతిపాదకులు మిమ్ములను వేర్వేరు నామినేషన్ పత్రాలలో నామినేటు చేయవచ్చును.

(డి) చట్టంలోని సెక్షన్ 234(1) క్రింద ఒకటికంటే ఎక్కువ వార్డులకు మీరు పోటీచేయడానికి వీలుపడదు. అయితే, ఒకటికంటే ఎక్కువ వార్డులకు మీరు నామినేషన్లను దాఖలు చేసుకొని, నామినేషన్ల ఉపసంహారణకు నిర్ధారించిన సమయంలోపల మీ అభీష్టం మేరకు ఒకే వార్డుకు సంబంధించిన ఒక నామినేషను తప్ప మిగతా అన్నింటిని ఉపసంహరించుకోవచ్చును. ఆ విధంగా చేయనట్లయితే, మీ అన్ని నామినేషన్లు చెల్లుబాటు కాకుండాపోతాయి.

(ఇ) ఎన్నికలో పోటీచేసేందుకు మీ సంసిద్ధతను తెలియజేస్తూ, ప్రతి నామినేషన్ ఫారంలోని డిక్లరేషనులో మీరు సంతకం చేయాలి.

(ఎఫ్) నామినేషన్ దాఖలు చేసేందుకు నిర్ణయించిన సమయంలో, నిర్ణయించిన తేదీలలో మీ నామినేషను పత్రాన్ని స్వయంగా మీరుగాని, మీ ప్రతిపాదకుడుగాని సమర్పించేటట్లు చూడటంలో తగువిధంగా జాగ్రత్త తీసుకోవాలి. మీ నామినేషన్ పత్రాన్ని ఎన్నికల అధికారికి (రిటర్నింగు అధికారి) లేదా ఆయన ద్వారా అధికారం పొందిన వ్యక్తికి ఎన్నికల నోటిఫికేషన్ నిర్దిష్టపరచిన ప్రదేశంలో సమర్పించాలి. నామినేషన్ ఫారం అన్ని విధాల సమగ్రంగా వుండేటట్లు చూడాలి. నామినేషన్లు దాఖలు చేయడానికి చివరి తేదీన నిర్ధిష్టపరచిన సమయం తరువాత దాఖలయిన నామినేషను ఫారాలను నిరాకరించడమవుతుంది.

(జి) నామినేషను పత్రం సమర్పించిన మీదట, ఎన్నికల అధికారి (రిటర్నింగు అధికారి) లేదా ఆయన ద్వారా అధికారం పొందినట్టి వ్యక్తి, నామినేషను పత్రంలో పేర్కొన్న వ్యక్తి, ఆయన ప్రతిపాదకుని పేర్లు ఎన్నికల జాబితా నెంబర్లు ఎన్నికల జాబితాలో నమోదయినట్లుగానే వున్నాయని స్వయంగా సంతృప్తి చెందాలి.

(హెచ్) అభ్యర్థి లేదా ఆయన ప్రతిపాదకుని పేరుకు సంబంధించి లేదా అభ్యర్థికి లేదా ఆయన ప్రతిపాదకునికి సంబంధించిన ఇతర వివరాల విషయంలో ఎన్నికల జాబితాలో లేదా నామినేషను పత్రంలో అవి సరిగా లేకపోయినా వ్రాతపొరపాటు లేదా ముద్రణా దోషం వున్ననూ, సందర్భాన్నిబట్టి, అభ్యర్థి లేదా ప్రతిపాదకుని గుర్తింపునకు సంబంధించి ఇతర విధంగా సహేతుకమయిన సందేహం ఏదీ లేకుండా రుజువయినట్లయితే సదరు దోషాలు నామినేషనుకు ఆటంకంగా వుండకపోవచ్చును.

(ఐ) నామినేషను పత్రాన్ని దాఖలు చేసేటప్పుడు, నామినేషను పత్రం ఎవరి సమక్షంలో దాఖలయిందో అట్టి ఎన్నికల అధికారి సదరు నామినేషను పత్రాన్ని అంగీకరించి మీకు ఇచ్చే తిరుగు రసీదును భర్తీ చేసి, అందులో సంతకం చేసేటట్లు చూడాలి.

(జె) నామినేషన్ల పరిశీలనకు నిర్ణయించిన సమయం, తేదీ, ప్రదేశం మున్నగువాటికి సంబంధించిన వివరాలను కలిగివుండే నామినేషన్ పత్రం రసీదును తీసుకోవడం మరచిపోకండి. ఈ విషయంలో నిర్లక్ష్యం చేయవద్దు.

**3. <u>నామినేషన్లతోపాటుగా రూఢి ప్రకటన (డిక్లరేషన్) :-</u>**

**(1) <u>ఎస్.సి., ఎస్.టి., బి.సి. తరగతులకు సంబంధించిన రూఢి ప్రకటన (డిక్లరేషన్) :-</u>**

(ఎ) రిజర్వుడు సీటుకు మీరు అభ్యర్థిగా వున్నట్లయితే, 3వ నమూనా (**IIIవ అనుబంధం**)లో నామినేషన్ పత్రానికి జతపరచిన డిక్లరేషను ఇచ్చి, అందులో మీరు సభ్యుడుగా వున్న ఫలాన తెగ లేదా కులం లేదా తరగతిని, ఆ తెగ లేదా కులం సందర్భాన్ని బట్టి ఏ షెడ్యూల్డు తెగలు లేదా షెడ్యూల్డు కులానికి లేదా వెనుకబడిన తరగతికి చెందినచో ఆ విషయాన్ని మీరు నిర్ధిష్టపరచాలి. ఈ రూఢి ప్రకటనను ఎవరేని ప్రభుత్వ గెజిటెడు అధికారి సమక్షమున లేక మండల రెవెన్యూ అధికారి సమక్షంలోనయినా చేయాలి.

(బి) షెడ్యూల్డు కులం లేదా షెడ్యూల్డు తెగ లేక వెనుకబడిన తరగతికి చెందిన సభ్యుడయిన అభ్యర్థి 10(1) నియమంలో రాష్ట్ర ఎన్నికల కమీషను నిర్దిష్టపరచినట్లుగా రాయితీతో కూడిన డిపాజిటుకు హక్కు కలిగి వుంటారు. రాయితీతోకూడిన రేటుకు అర్హులయిన అభ్యర్థి కూడా తన క్లెయిం మేరకు తాను షెడ్యూల్డు కులం లేదా షెడ్యూల్డు తెగకు చెందిన లేక వెనుకబడిన తరగతికి చెందిన వ్యక్తి అని పేర్కొంటూ తన నామినేషను పత్రంతోపాటుగా (**అనుబంధం-III**)లోని 3వ నమూనాకు (నామినేషను పేపరు) జతపరచిన రూఢి ప్రకటనను కూడా జతపరచాలి.

**(2) <u>క్రిమినలు యాంటిసిడెంట్సు (నేరచరిత్ర) ఆస్తులు, బాధ్యతలు (లయబిలిటీసు) మరియు విద్యార్హతలు :-</u>**

రాష్ట్ర ఎన్నికల కమీషను కోరిన విధంగాను, ఎన్నికల నిర్వహణ నియమావళిలోని నియమం 9(3) ప్రకారం ప్రతి అభ్యర్థి తన నామినేషను పత్రంతోపాటు ఆయన క్రిమినలు యాంటిసిడెంట్లు (నేరచరిత్ర), ఆస్తులు, బాధ్యతలు మరియు విద్యార్హతలకు సంబంధించి ఒక డిక్లరేషనును కూడా దాఖలు

చేయవలెను. అది నిబంధించబడిన నమూనాలో ఉండి, దానిపై సాక్షుల సంతకం ఉండవలెను.

ఈ విషయంలో రాష్ట్ర ఎన్నికల కమీషను, 2003 సెప్టెంబరు 6వ తేదీ గల నిర్దేశం నెం. 809/రా.ఎ.క-బీ 1/2003లో ఉత్తరువు జారీ చేసింది. తరువాత 2003, అక్టోబరు 24వ తేదీ గల ఉత్తరువు నెం. 809/రా.ఎ.క.బీ 1/2003-8లో దానిని ఇంకనూ సవరించింది. (సవరించబడిన ఉత్తరువు ప్రతిని అనుబంధం-IVలో) జతపరచడం జరిగింది. సదరు ఉత్తరువుననుసరించి-

(ఎ) గ్రామపంచాయతీ సభ్యుని లేక సర్పంచు పదవికి జరిగే ఎన్నికలో ప్రతి అభ్యర్థి తన నామినేషను పత్రంతోపాటు క్రిమినలు యాంటిసిడెంట్సు (గత నేరచరిత్ర), ఆస్తులు, బాధ్యతలు, విద్యార్హతలకు సంబంధించిన పూర్తి వివరాలను **అనుబంధం-IV (ఎ)** లో జతపరచిన విధంగా స్వయం డిక్లరేషను రూపంలో ఇద్దరు సాక్షుల సంతకంతో సమర్పించవలెను.

(బి) అభ్యర్థి లేక ఆయనను ప్రతిపాదించిన వ్యక్తి సదరు డిక్లరేషనును సమర్పించినట్లయితే, సదరు ఉత్తరువును ఉల్లంఘించినట్లు అవుతుంది. రిటర్నింగు అధికారి నామినేషన్ల పరిశీలన సమయంలో సంబంధిత అభ్యర్థి నామినేషనును తిరస్కరించవలెను.

**(3) <u>ఎన్నికలు ఖర్చు, లెక్కలు గురించిన డిక్లరేషను</u> :-**

అభ్యర్థి, **అనుబంధం-V**లో తెలిపిన నమూనాలో ఎన్నికల ఖర్చు నిర్వహణకు సంబంధించి, నామినేషనుల పరిశీలనకు స్థిరీకరించిన తేదీ మరియు సమయంలో రిటర్నింగు అధికారి సమక్షంలో ఒక డిక్లరేషనుపై సంతకం చేయవలెను. రిటర్నింగు అధికారి ఆ డిక్లరేషనుపై కౌంటరు సంతకం చేయవలెను.

**(4) <u>డిపాజిట్లు</u> :-**

ఎన్నికల నిర్వహన నియమావళిలోని నియమం 10(1) ననుసరించి రాష్ట్ర ఎన్నికల కమీషను నిబంధించునట్టి డిపాజిటు మొత్తాన్ని, నామినేషనుపత్రం సమర్పించు సమయాన లేక అంతకుముందు ప్రభుత్వ ట్రెజరీలో లేక సంబంధిత స్థానిక సంస్థ అకౌంటును కలిగి ఉన్న బ్యాంకులోగాని జమ చేయవలెను. లేదా జమ చేయించవలెను. నగదు రూపంలో అయినట్లయితే రిటర్నింగు అధికారికి చెల్లించవలెను. డిపాజిటును నగదు రూపంలో చెల్లించిన యెడల, అందుకు సంబంధించిన రశీదును రిటర్నింగు అధికారి నుండి పొందవలెను.

డిపాజిటు చేయవలసిన మొత్తాన్ని అభ్యర్థి లేక ఆయన ద్వారా మండలపరిషత్తు, లేక జిల్లా పరిషత్తు ఖాతాకు చేసిన చెల్లింపునకు ప్రభుత్వ ట్రెజరీ లేక బ్యాంకునుండి పొందిన రశీదును రిటర్నింగు అధికారికి అందజేసిన యెడల డిపాజిటు చేసినట్లు భావించవలెను.

# గ్రామపంచాయతీ ఎన్నికలు

## అభ్యర్థులు మరియు వారి ఎన్నికల ఏజెంట్లకు మార్గదర్శకాలు

<u>చేయవలసినవి</u> :-

- ఎన్నికలకు సంబంధించిన న్యాయ నిబంధనల గురించి స్వయంగా తెలుసుకోండి.
- గ్రామపంచాయతీ ఓటర్ల జాబితాలను సేకరించి వాటిని తనిఖీ చేసుకోండి.
- ఎన్నికలలో పోటీ చేయడానికి నిర్ణయించుకొనే ముందు ప్రస్తుత ఓటర్ల జాబితాలో మీ పేరు, చిరునామా మొదలగు వివరాలను తనిఖీ చేసుకోండి.
- ఎన్నికలలో పోటీ చేసేందుకు మీరు అర్హులుగా వున్న విషయాన్ని తనిఖీ చేసుకోండి.
- ఎన్నికలలో పోటీ చేసేందుకు మీరు అనర్హులు కారనే విషయాన్ని నిర్ధారణ చేసుకోండి.
- నామినేషన్ ఫారం నిర్ణీత నమూనాలో (నమూనా-III)లో వున్నట్లు తనిఖీ చేసుకోండి.
- నామినేషన్ ఫారాన్ని స్వయంగా సమర్పించండి లేదా మీ ప్రతిపాదకుని ద్వారా పంపండి. అంతేకాని ఇతరుల ద్వారా పంపకండి.
- మీ ప్రతిపాదకుడు మీరు వార్డు సభ్యుని పదవికి పోటీచేయుచున్నట్లయితే సంబంధిత వార్డులోని లేదా మీరు సర్పంచు పదవికి పోటీచేయుచున్నట్లయితే ఆ

గ్రామపంచాయతీలోని ఏదేని వార్డులోని ఓటర్ల రిజిష్టరులో రిజిస్టరైన ఓటరుగా ఉండేటట్లు చూసుకోండి.

- మీరు కావాలనుకుంటే ఒకటి కంటే ఎక్కువ నామినేషను పత్రాలను సమర్పించండి.
- మీరు సమర్పించిన నామినేషను పత్రానికి రసీదును పొందండి.
- నామినేషన్ల పరిశీలన సమయంలో మీరు స్వయంగా హాజరుకండి.
- చెల్లుబడి అయ్యే నామినేషన్ల జాబితాలో మీ పేరు ఉన్నట్లు తనిఖీ చేసుకోండి.
- చెల్లుబాటు అయ్యే నామినేటెడు అభ్యర్థుల జాబితాలో మీ పేరు ఖచ్చితంగా ఉన్నట్లు తనిఖీ చేసుకోండి.
- పోటీ చేసే అభ్యర్థుల జాబితాలో మీ పేరు, చిరునామా, ఇతర వివరాలు ఖచ్చితంగా ఉన్నట్లు తనిఖీ చేసుకోండి.
- నోటిపై చేసినట్లుగా పోలింగు గంటలు ఖచ్చితంగా ఉండునట్లు తనిఖీ చేసుకోండి.
- సకాలంలో, సక్రమమయిన రీతిలో ఎన్నికల ఏజెంటును నియమించండి.
- పోలింగుస్టేషన్ల జాబితా ప్రతిని పొందండి.
- ప్రతి ఒక పోలింగ్ స్టేషన్‌కు సకాలంలో, సక్రమమయిన రీతిలో ఒక పోలింగ్ ఏజెంటును, ఒక ప్రత్యామ్నాయ (రిలీఫ్) ఏజెంటును నియమించండి.
- మీ పోలింగ్ ఏజెంట్లకు ఓటర్ల జాబితా ప్రతులను సమకూర్చండి.
- సక్రమమైన రీతిలో, కౌంటింగు ఏజెంట్లను నియమించండి.
- కౌంటింగు సమయంలో స్వయంగా హాజరుకండి.
- నామినేషను దాఖలు చేసిన తేదీ నుండి ఎన్నికల ఫలితాలు ప్రకటించే తేదీ వరకు, మీ ఎన్నికల ఖర్చులకు సంబంధించిన లెక్కలను రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నమూనాలో పొందుపర్చండి.
- నామినేషను పత్రంపై సంతకం చేయండి.
- నామినేషను దాఖలు చేయునపుడు అభ్యర్థి యొక్క క్రిమినలు యాంటిసిడెంట్లు (గత చరిత్ర), ఆస్తులు, అప్పులు మరియు విద్యా విషయముల అర్హతలకు సంబంధించిన సమాచారమును వెల్లడించుట కొరకు నిర్దిష్టపరచిన పత్రముపై మీరు మరియు ఇద్దరు సాక్షులు సంతకం చేయండి.

**<u>చేయకూడనివి</u> :-**

- నామినేషను పత్రాన్ని, సమర్పించేందుకు నిర్ణయించిన నిర్ధిష్టవేళలకు ముందుగాగాని, తరవాతగాని సమర్పించండి.
- నామినేషను పత్రాన్ని, రిటర్నింగు అధికారికి లేక ఈ విషయంలో అధికారం పొందిన అధికారికి కాకుండ, ఏ ఇతర వ్యక్తికి సమర్పించకండి.
- అవసరమయిన పైకాన్ని డిపాజిట్ చేయుడం మరచిపోకండి.
- ఎవరేని వ్యక్తి స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకొనే విషయంలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జోక్యం చేసుకోకండి లేదా జోక్యం చేసుకోడానికి ప్రయత్నించకండి.
- మతం, జాతి, కులం, వర్గం లేదా భాష కారణాలపై ఓటు వేయవలసిందని లేదా ఓటు వేయవద్దని ఓటర్లకు విజ్ఞప్తి చేయకండి.
- మతపరమయిన చిహ్నాలను లేదా జాతీయ చిహ్నాలను ఉపయోగించకండి లేదా విజ్ఞప్తి చేయకండి.
- మతం, జాతి, కులం, వర్గం లేదా భాష కారణాలపై వివిధ తరగతుల పౌరుల మధ్య శతృత్వ లేదా ద్వేషభావాలను రెచ్చకొట్టకండి, లేదా రెచ్చకొట్టడానికి ప్రయత్నించకండి.
- ఎవరేని అభ్యర్థి వ్యక్తిగత ప్రవర్తన గురించి, లేదా అభ్యర్థిత్వానికి సంబంధించిన లేదా ఎవరేని అభ్యర్థిత్వ ఉపసంహరణకు సంబంధించిన తప్పుడు ప్రకటనలను ప్రచురించకండి.
- ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు చేర్చడానికి లేదా అచటినుండి వారిని తరలించడానికి వాహనాలను అద్దెకు తీసుకోకండి లేదా సేకరించకండి.
- మీ ఎన్నికలకు గరిష్ఠంగా నిర్ణయించిన దానికంటే ఎక్కువగా ఖర్చు చేయకండి లేదా ఖర్చు చేయడానికి అనుమతించకండి.

- ఎవరేని ప్రభుత్వ ఉద్యోగి మద్దతును పొందకండి.
- పోలింగ్ కేంద్రం వద్ద చెడు ప్రవర్తనకు పాల్పడకండి.
- ఏదేని పోలింగ్ కేంద్రం వద్ద లేదా దాని సమీపంలో అనుచితంగా ప్రవర్తించకండి.
- పోలింగ్ ముగియడానికి నిర్దేశించిన సమయానికి 48 గంటలు ముందుగా పోలింగ్ ప్రాంతంలో బహిరంగ సమావేశాన్ని నిర్వహించకండి.
- ఎన్నికల సమావేశాలలో అల్లర్లను సృష్టించకండి. ఎన్నికల తేదీ లేదా తేదీలలో పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల లోపల ప్రచారం చేయకండి.
- రిటర్నింగ్ అధికారి లేదా ఆయన అనుమతి క్రింద అంటించిన ఏదేని జాబితాను లేదా నోటీసును లేదా ఇతర దస్తావేజులను లేదా నామినేషను పత్రాన్ని వంచనతో ధ్వంసం చేయకండి.
- ఏదేని బ్యాలెట్ పత్రాన్ని లేదా బ్యాలెట్ పత్రాలపై ఉన్న ఏదేని అధికారిక గుర్తు (అఫీషియల్ మార్కు)ను లేదా ఏదేని గుర్తింపు డిక్లరేషనును ధ్వంసం చేయకండి. బ్యాలెట్ పత్రాలు కాకుండా ఇతరమైన దేనినిగాని బ్యాలెట్ పెట్టెలలో వేయకండి.
- ఏదేని బ్యాలెట్ పెట్టెను లేక బ్యాలెట్ పత్రాన్ని ధ్వంసం చేయకండి, బయటకు తీసుకుని పోకండి లేదా ఇతర విధంగా వాటి విషయంలో జోక్యం చేసుకోకండి.
- అభ్యర్థుల వ్యక్తిత్వానికి సంబంధించి లేక ప్రవర్తన గురించి లేక అభ్యర్థిత్వము గురించి లేక అభ్యర్థిత్వ ఉపసంహరణ గురించి మీ అనుమతితోగాని, మీ ఎన్నికల ఏజెంటు అనుమతితోగాని, ఎన్నికలో అభ్యర్థి పై ప్రతికూల అభిప్రాయానికి ఉద్దేశించిన వివరణ ఇస్తూ అసత్యమని, వాస్తవం కాదని, మీరు నమ్మిన తప్పుడు ప్రకటన చేయకండి.
- ఏ అభ్యర్థినిగాని, ఏ ఓటరునిగాని, ఏ వ్యక్తినిగాని, సంఘము నుండి వెలివేయుటతో పాటు కులం లేక సమాజం నుండి వెలి/ బహిష్కరించుటకు బెదిరించ ప్రయత్నం చేయకండి.
- ఏ అభ్యర్థినిగాని లేక ఓటరునిగాని అతను లేక ఆయన హితము కోరియున్న వ్యక్తినిగాని దైవకోపానికి లేక ఆధ్యాత్మిక ఆక్షేపణలకు గురి అగుదురని నమ్మించుట, మభ్యపెట్టుటగాని, ప్రయత్నించుటగాని చేయకండి.
- ఎన్నికలలో ఒకరి ఓటును ఇంకొకరు వేసే నేరాన్ని ప్రోత్సహించకండి.
- ఎన్నికల ఫలితాలను ప్రకటించిన తేదీ నుండి 45 రోజుల లోపల మీ ఎన్నికల ఖర్చు లెక్కలను సంబంధిత మండల పరిషత్తు అభివృద్ధి అధికారి ద్వారా జిల్లా ఎన్నికల అధికారికి (జిల్లా కలెక్టరుకు) దాఖలు చేయడం మరచిపోకండి.
- పోలింగు కేంద్రం వద్దను, ఓట్ల లెక్కింపు కేంద్రం (హాల్) వద్దను సెల్‌ఫోనులు ఉపయోగించకండి.
- మీకు ఓటు వేసేందుకు గాను ఓటర్లకు మీ పేరును లేదా మీ గుర్తును లేదా ఏదేని ప్రాధాన్యం గల గుర్తింపు చీటీలను ఇవ్వకండి.
- ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేయడానికి లేదా పోటీ చేయకుండా వుండడానికి లేదా తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకోవడానికి లేదా ఉపసంహరించుకోకుండా ఉండడానికి లేదా ఎన్నికలలో ఓటు వేయడానికి లేదా ఓటు వేయకుండా వుండడానికి ఇతరులను ప్రోత్సహించడానికి ఏ వ్యక్తికి కూడా బహుమానం లేదా ప్రతిఫలాన్ని ఇవ్వచూపకండి లేదా ఇస్తానని వాగ్దానం చేయకండి.

**2013 ఎన్నికలకు సవరించిన ధరావతులు - వ్యయపరిమితులు**

ధరావతు వివరాలు (రూపాయల్లో)

| కేటగిరి | సర్పంచి అభ్యర్థి | వార్డు అభ్యర్థి | జడ్పీటీసీ అభ్యర్థి | ఎంపీటీసీ అభ్యర్థి |
|---|---|---|---|---|
| జనరల్ | 2,000 | 500 | 5,000 | 2,000 |
| ఎస్సీ,ఎస్టీ,బీసీ | 1,000 | 250 | 2,500 | 1,000 |

**వ్యయపరిమితి వివరాలు (రూపాయల్లో)**

| జనాభా | సర్పంచి అభ్యర్థి | వార్డు అభ్యర్థి |
|---|---|---|
| పదివేలకన్నా ఎక్కువ | 80,000 | 10,000 |
| పదివేలకన్నా తక్కువ | 40,000 | 6,000 |

- జడ్పీటీసీ అభ్యర్థుల వ్యయపరిమితి రూ. 2 లక్షలు
- ఎంపీటీసీ అభ్యర్థుల వ్యయపరిమితి రూ. 1 లక్ష

## పోలింగ్ ఏజెంట్ల మార్గదర్శకత్వం కొరకు చేయవలసినవి మరియు చేయకూడనివి

పోలింగ్ ఏజెంటు యొక్క అతి ముఖ్యమైన కర్తవ్యం పోలింగు కేంద్రంలో తనను నియమించిన అభ్యర్థి యొక్క ప్రయోజనాలను పరిరక్షించడం.

**చేయవలసినవి :-**

- అభ్యర్థిగాని లేక ఆయన పోలింగ్ ఏజెంటుగాని సంతకము చేసిన నిర్దిష్ట నమూనాలో పోలింగ్ ఏజెంటు నియామకపు లేఖను పొంది, దానిని సంబంధిత పోలింగు కేంద్రంలోని ప్రిసైడింగు అధికారికి సమర్పించండి.
- పోలింగుకు ముందు, పోలింగు సమయంలో, మరియు పోలింగు ముగిసిన తరువాత బ్యాలెట్ పెట్టెలను నియమావళిననుసరించి సరైన రీతిలో భద్రపరచి, సీలు చేయుటలో సహకరించండి.
- పోలింగు ముగిసిన తరువాత ఎన్నికల రికార్డులన్నింటిని నియమావళిని అనుసరించి వాటిని భద్రపరచి, సీలు చేయబడేటట్లు చూడండి.
- అసలైన ఓటరును గుర్తించే విషయంలో అనుమానం వచ్చినట్లయితే, అటువంటి వారి విషయంలో ప్రశ్నలు వేసి, ఒకరి ఓటును మరొకరు వేయకుండా చూడండి.
- పోలింగు కేంద్రానికి సంబంధించిన ప్రస్తుత ఓటర్ల జాబితా ప్రతినొకదానిని మీ వద్ద ఉంచుకోండి.
- చనిపోయిన, హాజరుకాని, ఆరోపించబడిన, అనుమానాస్పద ఓటర్ల పేర్లు ఏవైన ఓటర్ల జాబితాలో ఉన్నట్లయితే అట్టి జాబితాను మీ వద్ద ఉంచుకోండి.
- భద్రపరచబడిన ఎన్నిక పత్రాలను ఉంచిన కవర్లపై సీలు వేయడానికి ఉపయోగించే చిన్న ఇత్తడి సీలును మీరు తెచ్చుకోండి.
- నియమావళిననుసరించి తయారు చేయబడిన బ్యాలెట్ పేపరు అకౌంటు యొక్క ధ్రువీకృత ప్రతిని ప్రిసైడింగ్ అధికారి నుండి పొందండి.

**చేయకూడనివి :-**

- రహస్య ఓటింగు నియమాన్ని భంగపరిచే ఏ సమాచారాన్ని ఏ ఇతర వ్యక్తికి తెలియజేయకండి.
- ఏవరేని వ్యక్తి స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే విషయంలో, ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా జోక్యం చేసుకోకండి.
- ఏదేని బ్యాలెట్ పెట్టె లేక బ్యాలెట్ పేపరును ధ్వంసం చేయడం, బయటికి తీసుకొనిపోవడం లేక ఇతర విధంగా నాశనం చేయడం వంటి వాటికి పాల్పడకండి. పోలింగు కేంద్రం వద్ద దుష్టప్రవర్తనకు పాల్పడకండి.
- పోలింగ్ స్టేషన్ వద్ద చెడు ప్రవర్తనకు పాల్పడకండి.
- ఒకరి ఓటును ఇంకొకరు వేసే నేరాన్ని ప్రోత్సహించకండి.
- పోలింగు రోజు పోలింగు కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ప్రచారం చేయకండి.
- పోలింగు కేంద్రంలోనికి సెల్‌ఫోనులు తీసుకురాకండి.
- పోలింగు కేంద్రంలోపల పొగ త్రాగకండి.

## పంచాయతీల వేలం పాటలకు అడ్డుకట్ట వెయ్యండి

గ్రామ పంచాయతీలలో పోటీపడే అభ్యర్థులు కూర్చుని వేలం పాట ద్వారా సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలను కొనుగోలు చేయటం ఎన్నికల వ్యవస్థని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేయటమేనని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కటారి శ్రీనివాసరావు అన్నారు. ప్రజల అభీష్టం మేరకు కాకుండా ధనబలంతో పెత్తనాన్ని కొనుగోలు చేయడాన్ని లోక్‌సత్తా పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

రాష్ట్ర వ్యాపితంగా అనేక గ్రామాలు వేలం పాటల పాలయ్యాయని, లోక్‌సత్తా పార్టీ సభ్యులున్న చోట ఈ వేలంపాటలకు వ్యతిరేకంగా అభ్యర్థుల్ని నిలబెడుతుందని, లేనిచోట్ల ఈ వేలంపాటల్ని ప్రతిఘటించే అభ్యర్థులకు మద్దతిస్తుందని ప్రకటించారు.

పంచాయతీల బహిరంగ వేలం పాటలపై ప్రభుత్వం స్పందించకపోవటం గర్హనీయమని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఈ వేలం పాటల్ని నిరోధించటానికి తగిన చర్యలు తీసుకోవాలని, దీన్ని ఎన్నికలలో అవినీతిగా, ప్రజల ఓటు హక్కు వినియోగానికి అవరోధంగా ప్రకటించి అటువంటి అభ్యర్థులను అనర్హులుగా చెయ్యాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.




వెల : 60/-




వెల : 40/-




వెల : 60/-

# స్వీకారం

*చిరునామా :*

**ప్రగతి పబ్లిషర్స్**

3-11-275/1, ప్లాట్ : 2,
శ్రీ శంకర్‌కాలని, ఎల్.బి.నగర్,
హైదరాబాదు - 500 074
ఫోన్స్ : 040-24031257/
8096314553/8978672660


సేవానిరతి
క్రమశిక్షణ
అభివృద్ధి
మీ పిల్లల ఉజ్వల భవిష్యత్తుకై మన
భాగ్యనగర్ ఐ -టెక్నో స్కూల్
నర్సరీ నుండి 10 వ తరగతి వరకు (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే గుర్తింపబడింది) ఇంగ్లీషు మీడియం
సంగీత్‌నగర్, కూకట్‌పల్లి, హైద్రాబాద్-72. సెల్ : 9394062075, 040-64643264
మీ పిల్లలను సరైన స్కూల్‌లో చేర్పించండి. మీ కలలను నిజం చేసుకోండి.
మా ప్రత్యేకతలు :
డిజిటల్ టెక్నాలజీ ద్వారా విద్య.
కంప్యూటర్ విద్యకై సంపూర్ణ ల్యాబ్.
స్పోకెన్ ఇంగ్లీషు కొరకు ప్రత్యేక శిక్షణ.
ప్రత్యేకంగా శిక్షణ పొందిన ఉపాధ్యాయులచే పాఠాల బోధన.
ప్రతి ఒక్కరిపై ప్రత్యేక శ్రద్ధ.
ప్రాక్టికల్ గణిత బోధన :
ప్రత్యేక బోధనా పరికరములద్వారా లెక్కలు సులభముగా అర్థమయ్యేటట్లు శిక్షణ.
వినూత్న పద్ధతుల ద్వారా మాథ్స్(Maths) కాన్సెప్ట్ బోధన.
ప్రి ప్రైమరీ తరగతుల ప్రాధాన్యం :
అత్యున్నత ప్రమాణాలతో ప్రయోగాధారిత ప్రి ప్రైమరీ శిక్షణా పద్ధతులు అవలంబన.
విశాలమైన ఆటస్థలము కలదు.
కల్చరల్ ఆక్టివిటీస్.
ఇండోర్ మరియు అవుట్ డోర్ గేమ్స్.
రాష్ట్ర మాజీ విద్యాశాఖామంత్రి శ్రీ పి.వి.రంగారావు గారు మరియు రాష్ట్ర జైళ్ళ సూపరింటెంట్ శ్రీ గోపీనాథ్ రెడ్డి గార్ల నుంచి మా విద్యార్థిని యస్.అశ్విని 2011 ప్రతిభా అవార్డు & యస్‌యస్‌సిలో స్కూల్ టాపర్ అవార్డు అందుకుంటున్న దృశ్యం.
2010-2014 సం॥లలో డి.వి.ఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ టాపర్‌గా నిలుస్తున్న మా పాఠశాల విద్యార్థి వి.డి.యన్.యస్.మూర్తి
అతి తక్కువ ఫీజులతో, అత్యుత్తమ విద్యాబోధన
మీ కలలను నిజం చేసుకునే సువర్ణావకాశం.
నర్సరీ నుండి 10 వ తరగతి వరకు
అడ్మిషన్లు ప్రారంభమైనవి.


వినయం !
విజ్ఞానం !!
వివేకం !!!
గ్లోబల్ i టెక్నో స్కూల్
Recognised by Govt. of A.P.
నర్సరీ నుండి 10వ తరగతి వరకు (ఇ / మీ)
అడ్మిషన్లు ప్రారంభమైనవి
డొనేషన్లు లేవు
మా ప్రత్యేకతలు
అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యా బోధన
ప్రతి తరగతిలో గరిష్ఠ విద్యార్థుల సంఖ్య 25- 30
పచ్చని విశాలమైన క్రీడా ప్రాంగణము.
మానసిక, శారీరక అభివృద్ధికి క్రీడా విద్య.
అత్యాధునిక ఆడియో - విజువల్ ల్యాబ్
6వ తరగతి నుండి ఐఐటి ఫౌండేషన్
అర్హులైన ఉపాధ్యాయుల పర్యవేక్షణలో స్టడీ అవర్స్
Introducing
Global Toddlers
The Play School
Transport Facility Available



బెల్టుషాపుల రద్దు కోరుతూ హైదరాబాద్‌లో లోక్‌సత్తా ధర్నా



వర్షపునీటిని నిల్వ చేసుకునే పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న జేపీ
కూకట్‌పల్లి



మహిళా కమీషన్ ఛైర్‌పర్సన్‌తో మహిళాసత్తా నాయకులు



మహిళాసత్తా సభ్యత్వ పుస్తకాలను విడుదల



కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ వలంటీర్ల సమావేశం



జూబ్లీహిల్స్‌లో యువసత్తా సభ్యత్వ నమోదుకు హాజరైన
లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యదర్శి కటారి శ్రీనివాసరావు



పంచాయితీలలో సుపరిపాలన అనే అంశంపై
వినుకొండలో రౌండ్‌టేబుల్ సమావేశం

RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2013-15




If not delivered please return to:

To,

Book-Post
PRINTED MATTER

**Lok Satta Times**
8-2-674B/2/9, Plot No. 93
Happy valley, Road No. 13A
Banjara Hills, Hyderabad - 500 034

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad